


లక్ష్మీదేవిగా బలుసులమ్మ

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని తాడేపల్లిగూడెం ప్రజల ఇలవేల్పు బలుసులమ్మ సోమవారం లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు రూ.30 లక్షల నగదుతో అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని విశేషంగా అలంకరించారు.



మహాలక్ష్మిగా మావుళ్లమ్మ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం మావుళ్లమ్మ ఆలయంలో ఉత్సవమూర్తిని సోమవారం మహాలక్ష్మి రూపంలో అలంకరించి కుంకుమ పూజలు చేశారు. ఆలయ కళా వేదికపై చండీ హోమం, లక్ష కుంకుమార్చనలను ప్రధానార్చకుడు మల్లికార్జునశర్మ, వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

'సదరం' పరీక్ష.. తప్పని ప్రయాస

నిర్దేశించిన సమయానికి వెళ్లినా నిరాశే

సర్కారు అందించే దివ్యాంగ పింఛన్‌కు సదరం ధ్రువపత్రమే కీలకం. దీనికి సంబంధించి నిర్వహించే వైద్య పరీక్షలు ప్రహసనంగా మారుతున్నాయి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, స్లాట్ ప్రకారం సంబంధిత వైద్యాలయాలకు వెళ్లినా.. ప్రయాస తప్ప ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది.



తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో దరఖాస్తుదారుల నిరీక్షణ

ఈనాడు, ఏలూరు, ఈనాడు డిజిటల్, భీమవరం

'సదరం' పరీక్షల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. దరఖాస్తుదారులు నెలల తరబడి నిరీక్షించి స్లాట్ బుక్ చేసుకున్నా.. పరీక్షలు మాత్రం సాగటం లేదు. కొందరికి సాంకేతిక సమస్యల పేరుతో పరీక్షలు చేయడం లేదు. దరఖాస్తుదారులు నానాపాట్లు పడుతున్నారు.

● ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి వినికిడి సమస్యతో సదరం ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. తణుకు జిల్లా ఆసుపత్రిని ఎంపిక చేసుకుని, అక్కడకు వెళ్తే.. జంగారెడ్డిగూడెం నుంచి రేడియాలజిస్ట్ రావాల్సి ఉందని సిబ్బంది చెప్పారు. చివరకు పరీక్షలు చేయించుకోకుండానే వెనుదిరిగారు.

● రాజమహేంద్రవరానికి చెందిన ఓ దివ్యాంగుడు పోలవరం సీహెచ్‌సీలో స్లాట్ ఖాళీ ఉందని దరఖాస్తు చేసుకున్నారు. అక్కడకు వెళ్తే వైద్యుడు రాలేదు. ఎప్పుడు రావాలో సమాచారం ఇస్తాం అంటూ సిబ్బంది తాపీగా చెప్పారు. అక్కడకెళ్లిన 10 మంది దివ్యాంగులు నిరాశగా వెనుదిరిగారు. ఒకొక్కరికి రూ.700-1000 వరకు ఖర్చయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

● గణపవరానికి చెందిన ఓ దివ్యాంగ మహిళ సదరం పరీక్షలకు భీమవరం ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్లారు. సాయంత్రం వరకు కూర్చోబెట్టి సాయంత్రానికి ఆన్‌లైన్‌లో చూపించటం లేదని సాంకేతిక సమస్య అని చెప్పారు. ప్రత్యేక ఆటోలో రావడానికి రూ.500, ఇతర ఖర్చులు రూ.300 వరకు అయింది.

ఉమ్మడి జిల్లాలో సదరం పరీక్షల వివరాలు

15	పరీక్షలు చేసే ఆసుపత్రులు
2000	స్లాట్ నిర్ధారణ అయినా పరీక్షల కోసం ఎదురు చూస్తున్న వారు
3	ఏటా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్న స్లాట్లు
300	ఒక్కో స్లాట్‌కు అవకాశం ఉన్న దరఖాస్తుదారుల సంఖ్య
6	వైద్యులు, సిబ్బంది కొరత ఉన్న ఆసుపత్రులు

ఆచరణకు ఆపసోపాలు

సదరం శిబిరంలో పరీక్షలు చేయించుకోవడానికి అధికారులు నిర్దేశించిన సమయంలో స్లాట్లు బుక్ చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. విధానం కాగితాల్లో బాగున్నా ఆచరణలో మాత్రం అధికారులు ఆపసోపాలు పడుతున్నారు.

● స్లాట్ ప్రకారం రోగులు వస్తున్నా వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. పోలవరం, చింతలపూడి, భీమడోలు పరిధిలో దివ్యాంగుల పరీక్షలు చేయాల్సి ఉన్నా వైద్యులు అందుబాటులో లేరు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం ఆసుపత్రుల నుంచి వైద్యులు వెళ్తేనే పరీక్షలు జరుగుతాయి. లేదంటే దరఖాస్తుదారులు కళ్లకాయలు కాచేలా ఎదురు చూసి కాళ్లకు పని చెప్పాల్సిందే. పశ్చిమలో తణుకులో మాత్రమే వినికిడి పరీక్షలు చేస్తారు. దీంతో ప్రస్తుతం 700 మంది పరీక్షల తేదీ కోసం ఎదురు చూస్తున్నారు.

దీనిపై ఏలూరు, పశ్చిమ డీసీహెచ్ఎస్‌లు పాల్‌సతీశ్, సూర్యనారాయణ మాట్లాడుతూ వేగంగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

'మద్య'వర్తుల రాయ'బేరం'!

వ్యాపారుల గూడుపుఠాణి

పాలకొల్లు, న్యూస్‌టుడే: అయిదేళ్ల తర్వాత అమల్లోకి వచ్చిన కొత్త మద్యం పాలసీ వ్యాపారుల్లో కిక్కు పెంచింది. లాటరీలో మద్యం దుకాణం ఒకటి తగిలితే చాలు పరపతి పెంచుకోవచ్చనేది చాలా మంది భావన. ఆ అవకాశం దక్కించుకోవడానికి రాజకీయ నేతల నుంచి దిగువస్థాయి దళారుల వరకు ప్రస్తుతం ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. దరఖాస్తు దాఖలుకు మరో రెండు రోజులే సమయం ఉండటంతో జిల్లాలో అనేక ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వ్యాపార వాంఛ, రాజకీయ కాంక్షల మధ్య మధ్యవర్తులు రాయబారం నడుపుతున్నారు.

నేతల వారసుల జోక్యం.. జిల్లాలోని ఇద్దరు ఎమ్మెల్యేల వారసులు మద్యం దరఖాస్తుల విషయంలో జోక్యం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. వారికి తెలియకుండా దరఖాస్తులు చేయకూడదని హుకుం జారీ చేసినట్లు వ్యాపారులు వాపోతున్నారు. తీరప్రాంత ఎమ్మెల్యే ఒకరు కనీసం 10 దుకాణాలు తనకు వదిలేయాలని కోరుతున్నారు. మరో నేత తన పరిధిలోని దుకాణాల్లోనూ 20 శాతం వాటా అడుగుతున్నారని చెబుతున్నారు. 10శాతానికైతే సరేనన్న సంకేతాలు మధ్యవర్తుల ద్వారా చేరాయి.

సిండికేట్లు ఏర్పాటు.. గతంలో రూ.50 వేలు తిరిగిరాని డిపాజిట్‌గా ఉండేది. ప్రస్తుతం ఆ మొత్తం రూ.2 లక్షలకు పెరగడంతో ఎక్కువ దరఖాస్తులు దాఖలుకు ఆర్థిక పరిమితి కారణంగా వ్యాపారులు సిండికేటుగా ఏర్పడుతున్నారు. సిండికేటు నుంచి కనీసం 20 దరఖాస్తులు తక్కువ కాకుండా వేసేందుకు సిద్ధమయ్యారు. ఏ ఒక్కరికి లాటరీలో దుకాణం వచ్చినా అందరికీ వాటాలుండేలా ఒప్పందం చేసుకున్నారు. ప్రతిపక్ష నాయకులు సిండికేట్‌లో సభ్యులవుతున్నారు.

జాతకాల జోరు.. సిండికేటు వ్యాపారుల్లో కొందరు జాతకాల ఆధారంగా దరఖాస్తులు చేస్తున్నారు. పేరు, నక్షత్రం బట్టి ఉన్నవారిలో ఎవరి జాతకం బలంగా ఉందో వారి పేరిట దరఖాస్తు చేస్తున్నవారు పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో ఉన్నారు. జాతకం బాగుందనిపిస్తే ఆధార్‌కార్డు, బ్యాంకు పుస్తకాలు తీసుకుని పెట్టుబడి పెట్టకపోయినా ఆ పేరుతో దరఖాస్తు చేయడానికి కొందరు సిద్ధమయ్యారు.

వడ్డీలకు డబ్బులేవు.. వడ్డీ వ్యాపారులు సైతం జిల్లాలో పదిరోజులుగా కొత్త లావాదేవీలు నిలిపేశారు. దరఖాస్తుదారులకు ఆయా మొత్తాలు మళ్లించడంతోపాటు అధిక వడ్డీలకు వ్యాపారులు అప్పులు తీసుకెళ్తున్నారు. లావాదేవీలు ప్రస్తుతానికి నిలిపివేసినట్లు పాలకొల్లుకు చెందిన వడ్డీ వ్యాపారి తెలిపారు.

బస్సులో ప్రయాణం పండగే



నరసాపురం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా జిల్లా నుంచి హైదరాబాదు వెళ్లి, వచ్చే ప్రయాణికులతో రద్దీ నెలకొంది. విద్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవుల నేపథ్యంలో హైదరాబాదులో బంధువులు ఉన్న ఈ ప్రాంత వాసులు అక్కడకు, అక్కడి నుంచి ఇక్కడకు వచ్చేవారి ప్రయాణానికి వీలుగా ఆర్టీసీ సంస్థ ఈ నెల 2 నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది.

గతానికి భిన్నంగా.. గతంలో పండగలు, ఇతర ప్రత్యేక రోజుల్లో ఏర్పాటు చేసే బస్సుల్లో ప్రయాణికుల నుంచి అధిక రుసుము వసూలు చేసేవారు. దీనికి భిన్నంగా ఈసారి సాధారణ రోజుల్లో మాదిరే ప్రయాణికుల నుంచి రవాణా ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

తేదీల వారీగా ప్రత్యేక బస్సుల వివరాలు..

డిపో	8న	9	10	11	12	13	14
నరసాపురం	2	3	4	5	1	3	2
భీమవరం	2	3	4	4	1	3	2
తణుకు	1	2	4	4	1	3	2
తాడేపల్లిగూడెం	-	1	1	1	1	3	2

అంతర్జాలంలో ముందస్తు టిక్కెట్లు.. ప్రయాణికులు ముందస్తుగా టిక్కెట్లను అంతర్జాలంలో రుసుము చెల్లించి నమోదు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. దీంతో రద్దీ ఎక్కువగా ఉంటే ముందుగా తెలిసే అవకాశం ఉంటుంది. ఈ నెల 8 నుంచి 11 వరకూ ఉదయం జిల్లాలోని ఆయా డిపోల నుంచి బస్సులు హైదరాబాద్ బయలుదేరి వెళ్తాయి. సాయంత్రం అక్కడి నుంచి ప్రయాణికులను తీసుకురానున్నాయి. ఇక్కడి నుంచి 12, 13, 14 తేదీల్లో ప్రత్యేక బస్సులు బయలుదేరి వెళ్లనున్నాయి. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటే ఇంకా మరిన్ని అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని డీపీటీవో ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు.

నకిలీ సంఘాలతో.. మాయాజాలం!

- భారీగా రుణాలు పొంది ఎగవేత
- త్వరలో గ్రామాల వారీగా విచారణ

☛ గత వైకాపా ప్రభుత్వ హయాంలో తాడేపల్లిగూడెం, భీమవరం పట్టణాల్లో మెప్మా పరిధిలో కొత్తగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేశారు. ఆయా సంఘాల ద్వారా పొందిన రుణాలను తిరిగి చెల్లించడం లేదని సమాచారం. ఈ వ్యవహారంలో వైకాపా నాయకుల హస్తం ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

☛ తణుకు మండలం దువ్వ గ్రామ సమాఖ్య పరిధిలో బోగస్ స్వయం సహాయక సంఘాలు ఉన్నట్లు రెండేళ్ల కిందట గుర్తించారు. ఎన్నికలకు ముందు ఈ గ్రామంలో కొందరు వీవోఏలు సంఘాల సభ్యులకు తెలియకుండానే బ్యాంకుల నుంచి సుమారు రూ.30 లక్షల వరకు రుణాలు తీసుకున్న వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది.

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: వైకాపా సర్కారు హయాంలో పలు జిల్లాల్లో అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో వీవోఏలు మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి భారీగా రుణాలు పొంది స్వాహా చేసినట్లు ప్రస్తుత ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో నకిలీ సంఘాలను గుర్తించేందుకు బ్యాంకు లింకేజీ రుణాల ఆధారంగా గ్రామ సమాఖ్యలు, మెప్మా వద్ద ఉన్న వివరాలతో సరిపోల్చాలని ఆదేశించింది. పలు పట్టణాలు, గ్రామాల్లో సెర్ప్, మెప్మా విభాగాల వీవోఏలు, ఆర్పీలు ఈ అక్రమాల్లో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం.



సమావేశంలో డ్వాక్రా సభ్యులు (పాత చిత్రం)

గ్రామ సమాఖ్యలు	స్వయం సహాయక సంఘాలు	సభ్యులు
897	30,195	3.02 లక్షలు (సుమారుగా)

ప్రతి సంఘానికి గుర్తింపు సంఖ్య.. డ్వాక్రా సంఘాలకు ఇకపై ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 30,195 సంఘాలు ఉన్నాయి. వీటిలో 3 లక్షలకు పైగా సభ్యులు ఉన్నారు. ఇప్పటి వరకు వీరికి మాన్యువల్ ఐడీ మాత్రమే ఉంది. నకిలీ సంఘాలు ఏర్పాటుకు అవకాశం లేకుండా డిజిటల్ ఐడీ రూపొందించాలని నిర్ణయించారు. దీంతో సంఘ సభ్యుల వివరాలన్నీ ఉంటాయి.

అక్రమాలు ఎన్నెన్నో.. ఇప్పటికే వేర్వేరు సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారితో కొత్త సంఘాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించారు. దువ్వ, పెనుమంట్ర, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు వెలుగు చూశాయి. మరోపక్క సంఘాల్లో సభ్యులకు తెలియకుండా వీవోఏలు, ఆర్పీలు రుణాలు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బోగస్ సంఘాల ఏర్పాటు, రుణాలను పక్కదారి పట్టడంలో బ్యాంకు సిబ్బందితో పాటు వీరు కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. స్త్రీనిధి రుణాల్లోనూ పలు ప్రాంతాల్లో అక్రమాలు వెలుగు చూశాయి.

బ్యాంకు వివరాల ఆధారంగా.. స్వయం సహాయక సంఘాలు రుణాలు పొందిన బ్యాంకుల నుంచి వివరాలు సేకరించి గ్రామ సమాఖ్య డేటాబేస్‌తో సరిపోల్చనున్నాం. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు వచ్చాయి. త్వరలోనే గ్రామాల వారీగా విచారణ ప్రారంభం కానుంది. – డి. వెంకటేశ్వరరావు, వెలుగు డీపీఎం

ముంచెత్తిన జడివాన



భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి కొన్ని రహదారులపై మోకాలిలోతున నీరు నిలిచింది. స్థానిక రైతు బజారు వీధిలోని పల్లపు ప్రాంతం డ్రెయిన్లు బిగదన్ని నీరంతా రోడ్డుపై నిలిచిపోవడంతో వాహన చోదకులు అవస్థలు ఎదుర్కొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'మీ కోసం' కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులనుద్దేశించి మాట్లాడారు. మొత్తం 146 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో ఉదయభాస్కరరావు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ● ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల పట్టాలను కొందరు ప్రజాప్రతినిధుల ఒత్తిడి కారణంగా వీఆర్వో నిలుపుదల చేశారని పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన పల్లెటి సుకన్య తదితరులు ఫిర్యాదు చేశారు. ● తన ఇంటిని ఇద్దరు కుమారులు ఆక్రమించుకుని తనను బయటికి గెంటేశారని భీమవరం బ్యాంకు కాలనీకి చెందిన కొప్పుల రామలక్ష్మి ఫిర్యాదు చేశారు. ● తనకు చెందిన రెండు సెంట్ల భూమిని సరిహద్దుదారు ఆక్రమించుకున్నారని చినసార్వ గ్రామానికి చెందిన కపురు బాలాజీ అర్జీ ఇచ్చారు. ● పొలం కొని 16 ఏళ్లయినా పట్టాదారు పుస్తకం ఇవ్వడం లేదని మత్స్యపురిపాలెంకు చెందిన కర్తాక థామస్ ఫిర్యాదు చేశారు. ● తన భర్తకు సంబంధించిన మరణ ధ్రువపత్రం ఇవ్వకుండా సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని తాడేపల్లిగూడెంకు చెందిన అడగళ్ల ధనలక్ష్మి ఫిర్యాదు చేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న నాగరాణి, అధికారులు

చివరికి గడ్డే మిగిలింది..!



పొలంలో గడ్డిని కోస్తున్న కౌలురైతు రంగారావు

ఇటీవల కురిసిన వర్షాలకు భీమవరం మండలం తాడేరు, బేతపూడి, వెంపలలోని వరిపొలాలు నీట మునిగాయి. గునుపూడి సౌత్ డ్రెయిన్‌తో పాటు ఇతర కాలువలు పూడిపోవడంతో తుపానులు, వరదలొచ్చిన ప్రతిసారీ నీరు పోటెత్తి పంటపొలాలను ముంచేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరినారుమళ్లు సిద్ధం చేసుకొని నాట్లు వేసే సమయానికి ముంచేయడంతో పంటలన్నీ వరదార్పణమయ్యాయి. చిత్రంలోని తాడేరుకు చెందిన కౌలు రైతు కొసనపూడి రంగారావు ఎనిమిదెకరాల్లో వరి నాట్లు వేశారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున పెట్టుబడి పెట్టామన్నారు. వరదకు పంటంతా కొట్టుకుపోయిందని చివరకు పొలంలో ఏపుగా పెరిగిన గడ్డిని దూడలకు వేసేందుకు కోస్తున్నారు. ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. ఇలా ఎంతో మంది రైతులు పంటలను నష్టపోయామని వాపోతున్నారు. తమ వద్దకు అధికారులు ఎవరూ రాలేదని పంటనష్టం నమోదు చేయలేదని చెబుతున్నారు. ఇప్పటికీ ఈ ప్రాంతంలోని పొలాల్లో నీరు ప్రవహిస్తూనే ఉంది. ఇలాగే కొనసాగితే పొలాల్లో సారంపోయి పంటలకు పనికిరావని ఆందోళన చెందుతున్నారు. - ఈనాడు, భీమవరం



బేతపూడి: పొలాల్లో నిలిచిన నీరు

రద్దు సరే.. బిల్లుల మాటేమిటి?

సెబ్ బకాయిలపై ఉద్యోగుల్లో ఆందోళన

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను సెబ్, ఎక్సైజ్ శాఖలుగా విభజించింది. ఇసుక, గంజాయి, నాటుసారా, మద్యం బెల్టు దుకాణాలు, అక్రమ రవాణా అరికట్టే బాధ్యతలను సెబ్‌కి, అధికారులు, సిబ్బందిపై అజమాయిషీ మాత్రం హోం శాఖకు అప్పగించింది. అయితే వైకాపా అమలు చేసిన మద్యం పాలసీలో భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. మరోవైపు సెబ్‌కు ఎటువంటి అధికారాలు లేకపోవడంతో ఎన్డీఏ సెబ్‌ను రద్దు చేసి, అధికారులు, సిబ్బందిని ఎక్సైజ్ శాఖలో విలీనం చేసింది. కానీ గతంలో తాము ఖర్చు చేసిన బిల్లులు వస్తాయో రావోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

తప్పని నిరీక్షణ.. జిల్లాలోని భీమవరం, ఆకివీడు, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం సెబ్ స్టేషన్ల నిర్వహణకు గత వైకాపా ప్రభుత్వం సుమారు రూ.2 కోట్ల వరకు బకాయిలున్నట్లు తెలిసింది. ఆదాయం సమకూర్చుకోవడంలో ఉన్న శ్రద్ధ నిర్వహణపై లేకపోవడంతో భవనాల అద్దెలు, స్టేషనరీ ఖర్చు, కరెంట్ బిల్లులు, వాహనాల నిర్వహణ ఖర్చులను అధికారులు సొంతంగా భరించి, వాటి కోసం నెలల తరబడి ఎదురు చూసేవారు. ఒక్కో స్టేషన్‌కు నెలకు రూ.25వేల నుంచి రూ.35వేల ఖర్చు చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం వాటిని మంజూరు చేయాలని కోరుతున్నారు.

రొయ్యల సాగుపై పరిశీలన

నెలాఖరులో యూఎస్ ఎఫ్‌డీఏ బృందం పర్యటన

ఈనాడు డిజిటల్, భీమవరం: వనామీ రొయ్యల సాగు విధానాన్ని పరిశీలించేందుకు అమెరికాకు చెందిన యునైటెడ్ స్టేట్స్ ఫుడ్ అండ్ డ్రగ్స్ అథారిటీ పరిశోధన బృందం ఈ నెలాఖరులో జిల్లాలో పర్యటించనున్నట్లు సమాచారం. ముందస్తు సమాచారం లేకుండానే ఈ బృందం తనిఖీలు చేపట్టనుంది. రొయ్యల సాగుకు రైతులు చెరువులను సిద్ధం చేసే పద్ధతులు, మేతల తయారీ విధానాన్ని పరిశీలించి రికార్డు చేయనున్నారు. మేతలు, ప్రొబయాటిక్స్, వ్యాధి నివారణ మందులను పరిశీలించడంతో పాటు వాటిని విక్రయించే దుకాణదారులు, డీలర్లను కలవనున్నారు. ప్రాసెసింగ్, విక్రయాలపైనా అధ్యయనం చేయనున్నారు. గిడ్డంగుల నుంచి సరకును కాకినాడ, విశాఖపట్నం, చెన్నై పోర్టులకు ఏ విధంగా పంపిస్తున్నారనే విషయాలు తెలుసుకుంటారు. ఈ అంశంపై ఎంపెడా ఉప సంచాలకుడు కందన్‌ను వివరణ కోరగా ఆ బృందం పర్యటన ఉంటుందని నిర్ధారించారు. మిగతా వివరాలు తెలియవని చెప్పారు.

ప్రతినెలా పరిష్కార వేదిక

'న్యూస్‌టుడే'తో విద్యుత్తు ఎస్ఈ రఘునాథ్‌బాబు



భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: నాణ్యమైన, కోతలు లేని విద్యుత్తు సరఫరా లక్ష్యంగా కృషి చేస్తానని విద్యుత్తు పంపిణీ సంస్థ ఎస్ఈ ఆలపాటి రఘునాథ్‌బాబు తెలిపారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. ఆ వివరాలు ఇలా..

తక్షణ స్పందన.. విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై తక్షణం స్పందించేలా ప్రతి నెలా ఎస్ఈ కార్యాలయంలో పరిష్కార వేదిక నిర్వహిస్తాం. సరఫరా సమస్యలు, బిల్లుల్లో వ్యత్యాసాలు, మీటర్ రీడింగ్‌లో లోపాలపై ఈ వేదికలో ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చు. ప్రతి సోమవారం మీకోసం కార్యక్రమం ద్వారా అందే అర్జీలను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరించేలా కృషి చేస్తా.

సూర్యఘర్ యోజన.. పీఎం సూర్యఘర్ యోజనకు జిల్లాలో 3,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. 155 యూనిట్లను ఇప్పటికే ఏర్పాటు చేసుకున్నారు. మరో 250 యూనిట్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది.

అందుబాటులో సామగ్రి.. ఈదురుగాలులు, భారీ వర్షాల సమయంలో విద్యుత్తు లైన్లు, పరివర్తకాలు దెబ్బతింటాయి. స్తంభాలు కూలిపోతుంటాయి. ఇలాంటి సమస్యలను వెంటనే పరిష్కరించేలా అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుతున్నాం.

నెలరోజుల్లో పరిహారం... విద్యుదాఘాతంతో ఎవరైనా మృతి చెందినప్పుడు సంబంధిత ధ్రువపత్రాలను వీలైనంత త్వరగా సమర్పిస్తే 30 రోజుల్లోపు పరిహారం అందుతుంది.

అప్రమత్తత అవసరం

గృహాలు, దుకాణాలు, వ్యవసాయ క్షేత్రాల వద్ద తరచూ విద్యుత్తు ప్రమాదాలు జరుగుతున్నాయి. నిపుణులైన సిబ్బందితో వైరింగ్ చేయించుకోవడంతో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇలాంటి సమస్యలు తలెత్తవు. ఎక్కడైనా విద్యుత్తు తీగలు కిందకి వేలాడుతున్నా.. మంటలు వస్తున్నా విద్యుత్తు సిబ్బందికి సమాచారం ఇస్తే వెంటనే సరిచేస్తారు.

ఉమాదేవికి స్వర్ణకిరీటం



నిడమర్రు, న్యూస్‌టుడే: మండలంలోని ... ఉమా నీలకంఠేశ్వరస్వామి క్షేత్రంలో అమ్మవారికి స్వర్ణ కిరీటం సమకూరింది. గ్రామస్థులు రూ.42 లక్షలు విరాళాలు సేకరించి, ఉమాదేవికి 500 గ్రాముల బంగారంతో కిరీటం చేయించారు. దీన్ని మంగళవారం అమ్మవారికి అలంకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దళారుల మాటలు నమ్మొద్దు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఇతర దేశాల కరెన్సీ ఇస్తామని దళారులు చెప్పే మాయమాటలు నమ్మొద్దని అదనపు ఎస్పీ వి.భీమారావు సూచించారు. భీమవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. వీటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను ఆదేశించారు.

రక్షణ కల్పించాలని వినతి.. **భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** జిల్లాలోని ప్రైవేటు వసతిగృహాల్లో విద్యార్థినులకు రక్షణ కల్పించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య బాధ్యులు కోరారు. యాజమాన్యాలు భారీగా డబ్బు వసూలు చేస్తున్నా తగిన వసతులు కల్పించడంలేదంటూ ఎస్పీ అద్నాన్ నయీం అస్మికి సోమవారం ఫిర్యాదు అందజేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు కె.దిన్నబాబు, రాయి వెంకట్, ప్రశాంత్, శిరీష, భరత్, తారక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు వృత్తి శిక్షణ

ఐటీఐ విద్యార్థులకు 3 నెలల తర్ఫీదు

ఉండి, న్యూస్‌టుడే: విద్యతో పాటు ఉద్యోగ శిక్షణ (ఆన్ జాబ్ ట్రైనింగ్) కార్యక్రమం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ఐటీఐలో ఎంచుకున్న ట్రేడ్‌కు అనువైన పరిశ్రమల్లో అవకాశాల సాధనకు మార్గం సుగమం చేస్తోంది. ఉండిలో ప్రభుత్వ ఐటీఐకి చెందిన పలువురు విద్యార్థులు ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో వివిధ కంపెనీల/సంస్థల్లో ఈ శిక్షణ పొందుతున్నారు.

భృతి, ఉచిత వసతి.. ఉండి ప్రభుత్వ ఐటీఐలో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో నూరు శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కొన్ని ట్రేడ్‌ల్లో సీట్లు కేటాయించలేనంత స్థాయిలో దరఖాస్తులొచ్చాయి. ఇక్కడ చదివే విద్యార్థులు ఏటా మూడు నెలల పాటు ఆన్ జాబ్ ట్రైనింగ్ పొందాల్సి ఉంది. ఈ ఏడాది సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని కర్మాగారంలో ఎలక్ట్రీషియన్ ట్రేడ్ విద్యార్థులు 18 మంది శిక్షణ పొందుతున్నారు. అక్కడే ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ విభాగంలో మరో 11 మంది చేరారు. గుంటూరులోని ఒల్గాస్ కంపెనీలో


ఏసీకి మరమ్మతు చేస్తున్న ఐటీఐ విద్యార్థి

బెంగళూరు, ఎన్టీఆర్ జిల్లాలోని బ్లూస్టార్ కంపెనీలో ఆర్ అండ్ ఏసీ విభాగంలో 12 మంది నైపుణ్య శిక్షణ పొందుతున్నారు. ఫిట్టర్ విభాగంలో విజయవాడ, భీమవరం కంపెనీల్లో 15 మంది పనిచేస్తున్నారు. రెండు రాష్ట్రాల్లో 72 మంది ఆన్ జాబ్ ట్రైనింగ్‌లో చేరారు. రెండు నెలల తర్వాత మరికొందరు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. శిక్షణ కాలంలో వసతి, భోజనంతో పాటు కొంత మేర భృతిని ఆయా సంస్థలు చెల్లిస్తాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వాటిలో అప్రెంటిస్ అవకాశం ఉంటుందని ఉండి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ వేగేశ్న శ్రీనివాస రాజు తెలిపారు.

యాప్‌ల భారం తగ్గించరూ..


ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం అందిస్తున్న కళ్యాణి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు తీసుకొచ్చిన వివిధ యాప్‌ల స్థానంలో ఒకే యాప్‌ను ప్రవేశపెట్టి పనిభారం తగ్గించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సుజాతరాణికి వినతిపత్రం అందజేశారు. రికార్డు పని తగ్గించాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఎండీ హనీమాబేగం తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ శాఖ ద్వారా ఉల్లి విక్రయాలు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉల్లిపాయలు, కూరగాయల ధరల నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. సంబంధిత అధికారులు, వర్తకులతో ఆయన తన కార్యాలయంలో సోమవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఉల్లిపాయలు ఒకేసారి పెద్ద ఎత్తున కొనుగోలు చేసి మార్కెటింగ్ శాఖ ద్వారా నియోజకవర్గాల వారీగా విక్రయాలు జరపాలని ఆదేశించారు.

ఆశలను అవకాశాలుగా మలుచుకునే సాధనమే సాంకేతికత

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఆశలను అవకాశాలుగా మలుచుకునే సాధనమే సాంకేతికత అని ఐబీఎం కన్సల్టెన్సీ లీడర్ సందీప్ చల్లా అన్నారు. స్థానిక ఏపీ నిట్ ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో సోమవారం టెడ్ ఎక్స్(టెక్నాలజీ, డిజైన్, ఎంటర్‌టైన్మెంట్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన


ప్రముఖులతో నిట్ విద్యార్థులు

మాట్లాడుతూ విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తూ సరికొత్తగా జీవించాలని సూచించారు. పారిశ్రామికవేత్త మెహర్ సాయి మాట్లాడుతూ దేశాభివృద్ధిని పరుగులు తీయించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసి పది మందికి జీవనోపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ బ్రెయిన్ కోచ్ జయసింహ, మాజీ ఐఏఎస్ అధికారి వివేక్ ఆత్రేయ, సినీ గాయకురాలు ఇంద్రావతి, రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో)

నెక్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

సెలవుల్లోనూ తరగతులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో పలు విద్యా సంస్థల్లో దసరా సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తుండటంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పలువురు విద్యాశాఖాధికారులకు ఫిర్యాదులు అందాయి. దసరా రోజున మాత్రమే సెలవు ఉంటుందని.. మిగిలిన రోజుల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాల్సిందేనని అధ్యాపకులు అంటున్నారని విద్యార్థులు చెబుతున్నారు. ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిందని ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి నాగేశ్వరరావు చెప్పారు. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే తనిఖీలు చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

టెట్‌కు 19 మంది గైర్హాజరు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని డీఎన్నార్ అటానమస్ కళాశాల కేంద్రంలో సోమవారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రెండు విడతల్లో జరిగింది. ఉదయం, మధ్యాహ్నం కలిపి 210కి గాను 191 విద్యార్థులు హాజరయ్యారని, 19 మంది గైర్హాజరయ్యారని డీఈవో జి.నాగమణి తెలిపారు.

గీత కార్మికులను ఆదుకోండి

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: గీత కార్మిక కుటుంబాలను ఆదుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన కల్లు విధానాన్ని ప్రకటించాలని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి కోరారు. భీమవరంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన మద్యం విధానం వల్ల ఏర్పాటయ్యే గొలుసు దుకాణాల కారణంగా కల్లు గీత కార్మికులు నష్టపోతారని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఆచంట(మార్టేరు), న్యూస్‌టుడే: విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల సంస్థ అధికారులు ఆచంటలో సంయుక్తగా తనిఖీ నిర్వహించి రేషన్ బియ్యం పట్టుకున్నట్లు పౌరసరఫరాల సంస్థ ఇన్‌ఛార్జి ఆర్ఐ కెవీవీ.సత్యనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక గాంధీజీ కాలనీ నటరాజ్ థియేటర్‌కు సమీపంలో స్థానిక గ్రామానికి చెందిన గెల్లి వెంకట విశ్వనాథ గుప్తా ఖాళీ స్థలంలో ఉన్న పశువుల షెడ్డు వద్ద ఏలూరు విజిలెన్స్ అధికారి పి.శివరామకృష్ణతో కలిసి తనిఖీ చేసినట్లు చెప్పారు. అక్కడ 123 బస్తాలను గుర్తించి పరిశీలించగా అవన్నీ పీడీఎస్ బియ్యంగా నిర్ధారించామన్నారు. 7,376 కిలోల బరువు ఉన్న ఈ బియ్యం విలువ సుమారు రూ.2.95లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ బియ్యాన్ని మధ్యవర్తుల సమక్షంలో స్వాధీన పర్చుకుని స్థానిక రేషన్ దుకాణ నిర్వాహకురాలికి అప్పగించినట్లు చెప్పారు. బియ్యం తరలించడానికి ఉంచిన వాహనాన్ని సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఈ ఘటనలో గుప్తాతో పాటు ఆచంటకు చెందిన ఎం.సత్యనారాయణ, కోనసీమ జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడికి చెందిన గంగరాజులపై కేసు నమోదైనట్లు చెప్పారు. గత నెల 10వ తేదీన వీరిపై విజిలెన్స్ అధికారులు దాడి చేసి 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నెల రోజుల లోపే మరోసారి వీరు పట్టుబడ్డారు.


పట్టుబడిన నిందితులు, వాహనాన్ని చూపుతున్న అధికారులు

కాల్‌మనీ కేసులో ఇద్దరి అరెస్టు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో కొన్నాళ్లుగా అధిక వడ్డీలకు అప్పులిస్తూ ఖాళీ ప్రామిసరీ నోట్లు, చెక్కులు తీసుకుని ప్రజలను పీడిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రావణ్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఏలూరుకు చెందిన మేడపాటి సుధాకర్‌రెడ్డి నగర పరిసర ప్రాంతాల్లో పలువురికి అధిక వడ్డీలకు పెద్ద మొత్తంలో అప్పులిచ్చాడు. నగదు తిరిగిరాబట్టే క్రమంలో వారిని శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేశాడు. అతడితో పాటు గూడవల్లి విద్యాసాగర్, మహ్మద్ అఖిల్ రెహ్మాన్, రాజేశ్, లావణ్య, మరికొందరు అనుచరులు బాధితులపై దౌర్జన్యానికి పాల్పడేవారు. వారిపై ఇటీవల బాధితులు ఒకటో పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. రైల్వేస్టేషన్ సమీప సత్రంపాడు ఎంఆర్‌సీ కాలనీకి చెందిన గూడవల్లి విద్యాసాగర్, శనివారపుపేట జెండాచెట్టు ప్రాంతానికి చెందిన మహ్మద్ అఖిల్ రెహ్మాన్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఒకటో పట్టణ సీఐ జి. సత్యనారాయణ, ఎస్సై మదీనాబాషా, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

భవాని భక్తులను ఢీకొన్న ఆటో

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

భీమడోలు, ఉంగుటూరు, న్యూస్‌టుడే: పూళ్ల- కైకరం గ్రామాల మధ్య సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం మాచవరానికి చెందిన భవాని భక్తులు పాదయాత్రగా విజయవాడ వెళ్తున్నారు. మార్గం మధ్యలోని కైకరం దాటాక వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీకొంది. ప్రమాదంలో మల్లిడి ఆదిరెడ్డి(24) అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు వెలగల శివ గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

'ఉద్యోగాల పేరిట మోసం'

మార్టేరు, న్యూస్‌టుడే: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్), ఆగ్రో లోగోలతో నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు సృష్టించి డబ్బులు దండుకుంటున్న ఘటనలు ఈ మధ్యకాలంలో తమ దృష్టికి వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగానికి ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు తీసుకోరని, అలా జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. నిరుద్యోగులు చైతన్యవంతులై మోసగాళ్ల బారిన పడి నష్టపోవద్దని సూచించారు.

భీమవరం

• భీమవరం • ఉండి

తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలా..?

నేడు డయల్ యువర్ కమిషనర్



భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణ పరిధిలో మీరు నివసించే ప్రాంతంలో పైపులైన్ల మరమ్మతులు, నీటి సరఫరాలో అవరోధాలు, పారిశుద్ధ్య లోపాలు, ఇంటింటా చెత్త సేకరణ ఇబ్బందులు ఉన్నాయా? ఇలాంటి సమస్యలను 'ఈనాడు-'ఫోన్ ఇన్' ద్వారా మీరు నేరుగా పురపాలక కమిషనర్ దృష్టికి తీసుకెళ్లవచ్చు. సంబంధిత అంశాలపై కమిషనర్ కె.రామచంద్రారెడ్డి సమాధానం ఇవ్వడంతో పాటు పరిష్కార చర్యలు చేపడతారు. వ్యక్తిగత అంశాలను ప్రస్తావించవద్దు.

తేదీ, సమయం	ఫోన్ చేయాల్సిన నంబరు
అక్టోబరు 8 (మంగళవారం), ఉదయం 10 నుంచి 11 గంటల వరకు	80085 74471

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

ఉండి, న్యూస్‌టుడే

సమస్య : చెరుకువాడ పరిధి రాజులపేట మార్గంలో సీసీ రహదారి వెంబడి కాలువ ప్రమాదకరంగా ఉంది. వాహనాలు అంచులో వెళ్తే డ్రెయిన్‌లోకి పడిపోయే ప్రమాదముంది.

- మహాలక్ష్మి, చెరుకువాడ

సమాధానం : డ్రెయిన్‌పై రాళ్లు వేయించాలని ప్రతిపాదన ఉంది. పంచాయతీలో నిధుల లభ్యతను బట్టి త్వరలోనే పనులు చేపడతాం.

- కొండవీటి సాంబశివరావు, సర్పంచి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రచయితలు

'తెలుగు తోట' ఖండకావ్యం ఆవిష్కరణ

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడుకు చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు, మధుర కవి చిర్రావూరి సూర్యనారాయణమూర్తి రచించిన 'తెలుగు తోట' ఖండకావ్యం ఆవిష్కరణ కార్యక్రమం ప్రముఖుల సమక్షంలో మహిషాసురమర్దని ఆలయ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ఆంధ్ర పద్య కవితా సదస్సు రాష్ట్ర అధ్యక్షుడు కొట్టే వెంకటాచార్యులు, పుష్పరాజు రచయితలు పాల్గొని ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. ఆంధ్ర పద్య కవితా సదస్సు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కవిమిత్ర వరప్రసాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి రామచంద్రరావు, విశ్రాంత ఆచార్యుడు జ్యోతుల కృష్ణబాబు, హైదరాబాద్ పరిషత్తు ప్రధాన కార్యదర్శి లంక నాగశేఖర తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం'లో ఆరు అర్జీలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమంలో ఆరు అర్జీలు అందాయని తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

15 నుంచి రెవెన్యూ సదస్సులు

ఉండి, న్యూస్‌టుడే: రీ- సర్వే జరిగిన ప్రాంతాల్లో ఈ నెల 15 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు వై.నాగార్జున తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రీ-సర్వేపై అభ్యంతరాలను ఈ సభల్లో స్వీకరిస్తామని తెలిపారు.

144 సెక్షన్ కొనసాగింపు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: కాళ్ల మండలంలోని కాళ్ల, ఏలూరుపాడు, పెదఅమిరంలలో 144 సెక్షన్ ఈ నెల 23వ తేదీ వరకు అమలులో ఉంటుందని ఎస్సై ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించి ఉత్తర్వులను తహసీల్దారు జి.సుందర్‌సింగ్ జారీ చేశారన్నారు. పోలీసు చట్టం 30 కూడా అమలులో ఉంటుందని డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య వెల్లడించినట్లు తెలిపారు.

నేటి నుంచి ప్రజాప్రతినిధులకు శిక్షణ

పాలకోడేరు, ఉండి, కాళ్ల, న్యూస్‌టుడే: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై ప్రజాప్రతినిధులకు మంగళవారం నుంచి రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పాలకోడేరు, ఉండి, కాళ్ల ఎంపీడీవోలు వి.రెడ్డియ్య, ఎస్.రవీంద్ర, జి.స్వాతి తెలిపారు.

జగజ్జననీ.. పాహిమాం



పాలకోడేరు: మహాచండి అలంకరణలో పోలేరమ్మ



తోలేరులో ప్రసన్న కనకదుర్గమ్మ



భీమవరం: లలితా త్రిపురసుందరి అలంకరణలో ఆదిలక్ష్మి

భీమవరం ఆధ్యాత్మికం, కాళ్ల, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో అమ్మవార్లను సోమవారం వేర్వేరు రూపాల్లో అలంకరించి



ఆకివీడు: అమ్మవారి సన్నిధిలో భక్తులు



కాళ్లకూరు: కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

విశేష పూజలు చేశారు. గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయంలో పార్వతీమాతను అన్నపూర్ణదేవిగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు.

వీరవాసరం, పాలకోడేరు, ఆకివీడు, న్యూస్‌టుడే: వీరవాసరం, రాయకుదురు, తోలేరు గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కనకదుర్గమ్మ ఆలయాల్లో పంచామృతాభిషేకాలు, సామూహికంగా కుంకుమ పూజలు చేశారు. పాలకోడేరులో పోలేరమ్మ, ఆకివీడులో పలు ఆలయాల్లో అమ్మవార్లు మహాచండీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

మళ్లీ ముంపు ముంగిట్లో..!

ప్రతిపాదనల దశలోనే అత్యవసర పనులు

ఉండి, న్యూస్‌టుడే: ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమయ్యాక యనమదుర్రు మురుగు కాలువలో ప్రవాహం మూడుసార్లు ప్రమాదకర స్థాయికి చేరి వేలాది ఎకరాల్లో చేలను ముంచెత్తింది. పలు ప్రాంతాల్లో స్లూయిజ్‌లు మరమ్మతులకు గురికావడంతో నష్టం తీవ్రత పెరిగింది. గట్లు బలహీనపడ్డాయి.

ఇలాంటి ప్రాంతాల్లో అత్యవసర పనులు చేపట్టాల్సి ఉండగా అవి ప్రతిపాదనల దశ దాటక పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నవంబరు నెలాఖరు వరకు భారీ వర్షాలకు అవకాశం ఉండటమే దీనికి కారణం.



ప్రస్తుత సీజన్లో వరద ఉద్ధృతి కారణంగా యండగండి - గరగపర్రు మధ్య బలహీనపడిన ఉండి పంట కాలువ గట్టు ఇది. అత్యవసరంగా పటిష్ఠీకరణ పనులు చేపట్టకపోతే రాబోయే రోజుల్లో ముంపు ముప్పు తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అసంపూర్తిగా ఆధునికీకరణ

నందమూరు అక్విడక్టు నుంచి ప్రారంభమయ్యే యనమదుర్రు కాలువ ఉండి, పాలకోడేరు, భీమవరం పట్టణాల మీదుగా ప్రవహించి మొగల్తూరు మండలంలో ఉప్పుటేరులో కలుస్తోంది. ఎగువన ఎర్రకాలువ సామర్థ్యానికి మించి నీరొచ్చినా, అధిక వర్షాలు కురిసిన సమయాల్లో యనమదుర్రుకు వరద నీరు పోటెత్తి చేలు ముంపు బారిన



యనమదుర్రు కాలువపై ప్రమాదకరంగా అవుట్‌ఫాల్ స్లూయిజ్

పడుతున్నాయి. భీమవరం పట్టణ పరిధిలోనూ పల్లపు ప్రాంతాలపై ప్రభావం పడుతోంది. జిల్లా ఆధునికీకరణలో ఈ కాలువ అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. అవుట్‌ఫాల్, సర్‌ప్లస్ వియర్ల పునర్నిర్మాణం జరగకపోవడం, వివిధ చోట్ల షట్టర్లు దెబ్బతినడంతో వరద వచ్చిన ప్రతిసారీ కష్టాలు తప్పడం లేదు.

జులైలో సంభవించిన వరదలకు యండగండి, భీమవరం, గొల్లవానితిప్ప ప్రాంతాల్లో భద్రపరిచిన వరద నివారణ సామగ్రిని పూర్తిస్థాయిలో వినియోగించాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆ సమయంలో ఉండి ప్రధాన, వెంకయ్య వయ్యేరు పంట కాలువల గట్లు పటిష్ఠత బలహీనపడ్డాయి. కొన్నిచోట్ల స్లూయిజ్‌లు, షట్టర్లు దెబ్బతిన్నాయి.

అనుమతుల కోసం నిరీక్షణ

యండగండి, గరగపర్రు, గొల్లకోడేరు తదితర ప్రాంతాల్లో అత్యవసర పనులు చేపట్టాలని గత జులైలోనే అధికారులు ప్రతిపాదించారు. పాత, కొత్త, అదనపు వియర్ల పనులకు రూ.39 లక్షలు, భీమవరం మండలం గూట్లపాడు వద్ద యనమదుర్రు కుడిగట్టుపై ఇన్‌లెట్ మరమ్మతులకు రూ.39 లక్షలు, పాలకోడేరు మండలం గరగపర్రు వద్ద యనమదుర్రు డ్రెయిన్ కుడిగట్టు మరమ్మతులకు రూ.30 లక్షలు అవసరమని తేల్చారు. ఈ పనులకు ఆమోదం లభించాల్సి ఉందని జలవనరులశాఖ ఉండి డీఈఈ సత్యనారాయణమూర్తి తెలిపారు.



మాట్లాడుతున్న మేడిద జాన్సన్

క్రీస్తు సందేశం ఆచరణీయం

పెదపుల్లేరు (ఉండి), న్యూస్‌టుడే: క్రీస్తు సందేశాన్ని విస్తరింపజేసేలా సేవకులంతా కృషి చేయాలని యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడిద జాన్సన్ పిలుపునిచ్చారు. పెదపుల్లేరులోని క్రీస్తు ప్రార్థనా మందిరంలో ఆ సంఘం మండల సమావేశం సోడదాసి పీటర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. జాన్సన్ మాట్లాడుతూ విశ్వాసులు ఇతరులపై ప్రేమ, కరుణతో వ్యవహరించాలన్నారు. అనంతరం సేవలకు నూతన వస్త్రాలు, ఆర్థిక సాయం, గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యదర్శి ములపర్తి యోనాతాన, గౌరవాధ్యక్షుడు డేవిడ్ మార్కు, సలహాదారులు సామ్యూల్, సోడదాసి వరదానం, నన్నేటి చంద్రబాబు, నీతిపూడి యోహాను, రాపాక జయరాజు తదితరులు మాట్లాడారు.

ఆక్రమణలు తొలగించాలంటూ ధర్నా

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: మాధవరంలో ఎస్సీల శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు డిమాండ్ చేశారు. భీమవరంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద కేవీపీఎస్, వ్యకాసం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో బీఎస్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు.



నినదిస్తున్న కేవీపీఎస్, వ్యకాసం నాయకులు

సమస్యలు పరిష్కరించండి

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు 13వ వార్డు పరిధిలో శ్మశాన స్థలం, మురుగు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శ్రీనగర్‌కాలనీలో సీపీఎం మహాసభను సోమవారం నిర్వహించారు. తొలుత పార్టీ జెండా ఆవిష్కరించిన నాయకులు సీతారాం ఏచూరి, ఆర్.సత్యనారాయణ, ఆర్.శివన్నారాయణల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. నాయకులు పెంకి అప్పారావు, ఎం.శ్రీను, దొడ్డి పద్మ, అమ్మాజీ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా వేతనాల్లేవ్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: తమకు వేతనాలు విడుదల చేయాలంటూ భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో ఆరోగ్య, శుభ్రత పనులు చేసే కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళనకు దిగారు. ఆరు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ 100 పడకల ఆసుపత్రిలో 30 మంది సిబ్బంది అవసరం కాగా ప్రస్తుతం 10 మంది మాత్రమే ఉన్నారన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆసుపత్రి శుభ్రత పనుల్లో నిమగ్నమైనా వేతనాలు రాకపోవడంతో వీరంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

సభ్యత్వ నమోదుపై 9న సదస్సు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదు, ఉమ్మడి పశ్చిమ- తూర్పుగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుపై ఈ నెల 9న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 3 గంటలకు బలుసుమూడిలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో సదస్సు జరుగుతుందని వెల్లడించారు. పార్టీ శ్రేణులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, బూత్ ఇన్‌ఛార్జులు హాజరు కావాలని కోరారు.



నగదు అందజేస్తున్న హరినాథబాబు కుటుంబ సభ్యులు

అన్నదాన పథకానికి విరాళం

కాళ్ల, న్యూస్‌టుడే: సీసలి గ్రామంలో ఉన్న శిర్డీ సాయిబాబా ఆలయంలో శాశ్వత అన్నదాన పథకానికి బొండాడ గ్రామానికి చెందిన బొండా హరినాథబాబా దంపతుల కుమారులు రామకృష్ణప్రసాద్, సుబ్రహ్మణ్యంలు రూ.1,11,111 విరాళం అందజేశారు. సోమవారం బాబా సన్నిధిలో అర్చకుడికి ఈ నగదు అందించినట్లు ఆలయ ఛైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతీ దేవి తెలిపారు.

ప్రమాదాలు 'కొని' తెచ్చుకోవద్దు

ఆకివీడు, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తప్పవని, చరవాణి మాట్లాడుతూ వాహనాలు నడిపినా కేసు నమోదు చేసి జరిమానా విధిస్తామని ఎస్సై నాగరాజు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆకివీడు ప్రధాన కూడలిలో ఆయన వాహన తనిఖీలు చేపట్టి చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చరవాణి మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్న 20 మంది చోదకుల నుంచి రూ.20,750 అపరాధ రుసుముగా వసూలు చేసినట్లు ఎస్సై చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: గుంటూరులో మంగళవారం నుంచి మూడు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు భీమవరం విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానాచార్యుడు ఎం.వేణు తెలిపారు. ఈ నెల 6న తాడేపల్లిగూడెంలోని వాకర్స్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు బీహెచ్ నాయక్, టి.ఉదయ్‌కిరణ్, ఎం.ప్రశాంత్, కేపీ ఆర్య, ఎన్.ఆరిఫ్‌లు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని శిక్షకుడు ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	దేవర
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	సత్యం సుందరం
నటరాజ్	రామ్‌నగర్ బన్నీ
కిషోర్ స్క్రీన్ 1	మత్తువదలరా 2
కిషోర్ స్క్రీన్ 2	దక్షిణ
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	స్వాగ్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	దేవర
విజయలక్ష్మి స్క్రీన్ 1	స్వాగ్
మహాలక్ష్మి స్క్రీన్ 2	కాళి

దారులన్నీ దయనీయం

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ అయిన మహదేవపట్నం చేరే ప్రధాన రహదారులు ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేదు. వెలివర్రులో వీర పేరంటాలమ్మ ఆలయం నుంచి మహదేవపట్నంలో లక్ష్మీ దేవి ఆలయం వరకు ఉన్న జడ్పీ రహదారి పూర్తిగా దెబ్బతింది. దాదాపు రెండున్నర కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిలో పలు చోట్ల భారీ గుంతలు ఏర్పడి రాళ్లు తేలాయి. వర్షం కురిస్తే ఈ మార్గం మడుగులా మారిపోతోంది. కొన్ని సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు కూడా ముందుకెళ్లని పరిస్థితి ఎదురవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహదేవపట్నం గుర్రపు బండి కూడలి నుంచి ఉప్పరగూడెం వరకు ఉన్న రహదారి ప్రస్తుతం నామరూపాల్లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టలేదు. నిధులు మంజూరైనా పనులు చేసేందుకు



మడుగును తలపిస్తున్న వెలివర్రు - మహదేవపట్నం రహదారి

గుత్తేదారులు ముందుకురాలేదు. ప్రధాన గ్రామం నుంచి భవానీపురం, ఉప్పరగూడెం నివాసిత ప్రాంతాలకు ఆటోలు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల మహదేవపట్నం వచ్చిన కలెక్టర్ నాగరాణికి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు రహదారుల సమస్యను వివరించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పనులను అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

ప్రాంగణమంతా పగుళ్లే!

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే అతి పెద్దదైన భీమవరం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం ఇది. నిత్యం 40 వేల మంది వరకు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. చాలా కాలం నుంచి నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో ఈ ఆవరణ పగుళ్లు తీసి అధ్వానంగా మారింది. ఈ సమస్యను డీఎం సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేపట్టేందుకు ఇంజినీరింగ్ విభాగం ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిందని తెలిపారు.



పాలకోడేరు ఎంపీడీవోగా రెడ్డియ్య

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు ఎంపీడీవో నియమితులైన వి.రెడ్డియ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసరాజు, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, కార్యాలయ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. గతంలో కృష్ణా జిల్లా పెడన మండలంలో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎన్.మురళీగంగాధరరావు భీమవరం బదిలీ అయ్యారు.

వేంకన్న ఆలయ ఈవోగా సత్యనారాయణరాజు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: జువ్వలపాలెం రోడ్డులో ఉన్న పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా ముదునూరి సత్యనారాయణరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కోనసీమ జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆలయాభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. గత ఈవో ఆర్.గంగాశ్రీదేవి సింగరాయపాలెం వల్లీ సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ సహాయ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

ఇసుక కొరతతో ఇబ్బందులు

పోడూరు, న్యూస్‌టుడే: ఇసుక లభ్యత లేక భవన నిర్మాణ రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా నాయకులు పిల్లి ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇసుక కొరతతో నిర్మాణ కార్మికులకు పనులు లేక పస్తులు ఉంటున్నారని తక్షణం ఇసుక ర్యాంపులు తెరచి పని కల్పించాలని ప్రసాద్ కోరారు. అనంతరం తహసీల్దార్ సయ్యద్ మౌలాన ఫాజిల్‌కు వినతిపత్రం అందజేశారు.



కుట్టు మిషన్లు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

మహిళల అభ్యున్నతికి కృషి

వీరవాసరం, న్యూస్‌టుడే: మహిళల అభ్యున్నతికి, వారి జీవనోపాధి మార్గాల మెరుగుకు కాపు బలిజ సంక్షేమ సేన కృషి చేస్తుందని ఆ సంఘం మండల అధ్యక్షుడు గుండా రామకృష్ణ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పలువురు మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించారు. వీరిలో 25 మంది మహిళలకు సోమవారం దాత సహకారంతో సమకూర్చిన కుట్టుమిషన్లను అందజేశారు. తమ సంఘం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 150 మందికి కుట్టు మిషన్లు అందజేశామన్నారు.

హద్దులు నిర్ధారించాకే ప్రక్షాళన

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: మహదేవపట్నం గ్రామంలో డ్రెయిన్ల సరిహద్దులను నిర్ణయించిన తర్వాతే ప్రక్షాళన పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ గ్రామ పరిధిలోని ఉప్పరగూడెంలో మురుగు పారుదలకు ఎదురవుతున్న అవరోధాలతో వరిచేలు ముంపుబారిన పడుతున్నాయి. ఈ సమస్యను ఇటీవల ఆ ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్ నాగరాణి దృష్టికి రైతులు తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ ప్రాంతాన్ని సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి, డ్రెయిన్ల శాఖ ఏఈ జయప్రకాశ్, వీఆర్వో ఎస్.చిన్నారావు, కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ తదితరులు పరిశీలించారు. కర్రకోడు, మహదేవపట్నం పొలిమేర కోడు, కర్రకోడు లింక్ తదితర డ్రెయిన్ల సరిహద్దులను నిర్ణయించాక పనులు చేపడతామని ఏఈ జయప్రకాశ్ తెలిపారు.



పూడిపోయిన డ్రెయిన్లను పరిశీలిస్తున్న అధికారులు

సొసైటీలకు మద్యం దుకాణాలు కేటాయించాలి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: గీత వృత్తిదారులకు ఇవ్వాలనుకుంటున్న మద్యం దుకాణాలను ప్రభుత్వం సంబంధిత సొసైటీలకు కేటాయించాలని చేతివృత్తిదారుల సమాఖ్య, ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సమితి నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిజమైన గీత కార్మికులకు లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

వినూత్న ఆలోచనలే ఆవిష్కరణలకు మూలం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వినూత్న ఆలోచనలే కొత్త ఆవిష్కరణలకు మూలమని సంయుక్త కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. భీమవరంలోని డాక్టర్ బీవీరాజు విద్యాసంస్థల ఆవరణలోని విష్ణు పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతరిక్షయానం గురించి యువ అనలాగ్ ఆస్ట్రోనాట్ దంగేటి జాహ్నవి వివరించారు. జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రదర్శనలో నమూనాలను పరిశీలించారు. విద్యాసంస్థల పరిపాలన విభాగం డైరెక్టర్ జె.ప్రసాదరాజు,



రాకెట్ పనితీరును వివరిస్తున్న పీఎస్ఎం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు

విద్యార్థి విభాగం పరిపాలక డైరెక్టర్ పి.శ్రీనివాసరాజు, ప్రిన్సిపల్ ఐఆర్‌కే రాజు, ఎల్.బిందు, ఇస్రో ప్రతినిధులు పాల్గొన్నారు

సమాజ హితమే.. అభిమతం!

జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: పరిమిత వనరులను సద్వినియోగం చేసుకుని స్ఫూర్తిదాయక విజయాలు సాధించారు భీమవరం మండలం దొంగపిండి ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థినులు నాగిడి లక్ష్మీ ప్రసన్న, స్రవంతి. వీరికి కొత్త విషయాలు తెలుసుకోవాలన్న తపన, ఆసక్తి ఎక్కువ. గైడ్ ఉపాధ్యాయిని రేవతి ప్రోత్సాహంతో శానిటరీ బయో నాప్కిన్స్ ప్రాజెక్టును రూపొందించారు. గతేడాది డిసెంబరులో గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన 31వ జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్‌లో వీరి ప్రాజెక్టుకు ఉత్తమ గుర్తింపు దక్కింది. ఈ ఏడాది జులైలో హైదరాబాద్‌లోని బిర్లా సైన్సు సెంటర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ వీరు రూపొందించిన ప్రాజెక్టుకు ఉత్తమ ప్రతిభా అవార్డు లభించింది.



అందుకున్న బహుమతులతో లక్ష్మీప్రసన్న, స్రవంతి

సమస్యను గుర్తించి..

గ్రామంలో సమస్యలపై సర్వే చేయాలని ఉపాధ్యాయిని సూచించారు. మా ప్రాంతంలో చాలా మంది మహిళలు సింథటిక్ పాడ్స్ వాడుతూ చర్మవ్యాధులతో ఇబ్బందులకు గురవుతున్నట్లు గుర్తించాం. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తే బాగుంటుందని భావించాం. ఉపాధ్యాయిని సూచనలతో అరటి కాండం, గుర్రపుడెక్క నారలను కలిపి శానిటరీ పాడ్స్ రూపొందించాం. వైద్యులు, నిపుణుల సూచనలతో వాటిని మరింత మెరుగ్గా తీర్చిదిద్ది కేవలం రూ.2కే తయారు చేయగలిగాం. మా ప్రాజెక్టుకు జాతీయ గుర్తింపు లభించడం సంతోషం కలిగించింది. భవిష్యత్తులో సమాజానికి మేలు చేసే మరిన్ని పరిశోధనలు చేయాలనేది మా లక్ష్యం.

- నాగిడి లక్ష్మీప్రసన్న, స్రవంతి

ఇసుక ర్యాంపులను తక్షణం తెరవాలి

పోడూరు, న్యూస్‌టుడే: ఇసుక లభ్యత లేక భవన నిర్మాణ రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా నాయకులు పిల్లి ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇసుక కొరతతో నిర్మాణ కార్మికులు పనులు లేక పస్తులు ఉంటున్నారని తక్షణం ఇసుక ర్యాంపులు తెరిచి పని కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్‌కు వినతిపత్రం అందజేశారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు


భోజనాలు వడ్డిస్తున్న మాధవనాయుడు

నరసాపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేశారని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు అన్నారు. తెదేపా యువనాయకుడు చాగంటి నరేంద్ర పుట్టినరోజు సందర్భంగా ఆయన సోమవారం అన్నక్యాంటీన్‌లో భోజనం, అల్పాహారం ఏర్పాటు చేశారు. దీనికి హాజరైన మాధవనాయుడు మాట్లాడారు.

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట: 91212 29087

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:

సమస్య: స్థానిక అచ్చుగట్లపాలెం నుంచి చిత్రావెర్రువుగట్టు వరకు పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి. వీటి కారణంగా రాత్రి పూట విషసర్పాలు సంచరిస్తున్నాయి. పిల్లలు, మహిళలకు ఇబ్బందికరంగా ఉంటుంది. **- శ్రీను, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- దావీదురాజు, పురపాలక పారిశుద్ధ్య అధికారి**

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ శివారు జిలింగెల్లలో ఏడు వీధిదీపాలు వెలగడం లేదని దీంతో వృద్ధులు, పిల్లలు చీకట్లో రాకపోకలకు భయపడుతున్న వైనంపై గత నెల 28న మేమున్నాం... మీకు తోడుగా.. శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన సమస్యపై పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని, పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకరరావు స్పందించి సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

ఉగ్గబెట్టాల్సిందే...

పట్టణంలో మహిళల ఇక్కట్లు

ఇళ్లకు వెళ్లేంత వరకు ఇబ్బందే

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే

వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే మహిళలకు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి నిత్యం 5 వేల మందికి పైగా మహిళలు ఇక్కడకు వివిధ పనులపై వస్తుంటారు. ప్రధాన రహదారులు, వ్యాపార సముదాయాలు, ఆసుపత్రుల వద్ద మరుగుదొడ్లు లేక మహిళలు పడరాని పాట్లు పడుతున్నారు. బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మాత్రమే సామాజిక మరుగుదొడ్లు ఉన్నాయి. ఇవి కూడా వ్యాపార కేంద్రాలకు దూరంగా ఉండటంతో వివిధ పనులపై వచ్చే మహిళలు పనులు పూర్తయ్యే వరకు అలానే ఉండాల్సిన పరిస్థితి.


తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సామూహిక మరుగుదొడ్డి

★ పాలకొల్లు చుట్టుపక్కల మండలాలైన యలమంచిలి, పోడూరు, పాలకొల్లు మండలాలతోపాటు ఇతర నియోజకవర్గాల నుంచి కూడా నిత్యం మహిళలు పట్టణానికి వస్తుంటారు. ప్రస్తుతం దసరా కావడంతో శుభకార్యాలకు అవసరమైన నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు ఇక్కడకు వస్తుంటారు. బస్టాండ్, బ్రైట్‌స్టేషన్, వ్యాపార కేంద్రాలు మహిళలతో రద్దీగా ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో కొందరు మహిళలు వ్యాపార సంస్థల నిర్వాహకులను అడిగి మరుగుదొడ్లను వినియోగించుకుంటున్నారు. కొందరు వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వాహనాలపై వచ్చేవారైతే బస్టాండ్ వరకు వెళ్లి తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. మరికొందరు అత్యవసర పరిస్థితుల్లో చేసేదిలేక షాపింగ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టి గమ్యస్థానం చేరుకొనే వరకు బిగపట్టి ఇబ్బంది పడుతున్నారు.

ఉపయోగం లేని మరుగుదొడ్లు..

అయిదేళ్ల కిందట తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మరుగుదొడ్లు నిర్మించారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో చుట్టూ చెత్త వేస్తున్నారు. దీనికితోడు మరుగుదొడ్లు నుంచి నీరు బయటకు రావడంతో అపరిశుభ్రతతోపాటు తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండ్, బ్రైట్‌స్టేషన్‌లో ఉన్న మరుగుదొడ్లు వినియోగానికి దూరంగా ఉండటంతో వీటిని వినియోగించుకోవాలంటే మహిళలు పడరాని పాట్లు పడుతున్నారు. రానున్నది కార్తికమాసం. వివిధ ప్రాంతాల నుంచి క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకొనేందుకు భక్తులు భారీగా తరలివస్తారు. అప్పటికైనా పురపాలక సంఘం స్పందించి సామూహిక మరుగుదొడ్ల ఏర్పాటుకు కృషి చేస్తే మంచిదని పలువురు కోరుతున్నారు.

దృష్టి పెడతాం..

మరుగుదొడ్ల నిర్మాణానికి దృష్టి పెడతాం. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. **- బి.విజయసారథి, మున్సిపల్ కమిషనర్**

బాణసంచా గోదాము తనిఖీ

పోడూరు, న్యూస్‌టుడే: మండలంలోని పెనుమదంలో నడుస్తున్న బాణసంచా గోదామును తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాము నిర్వాహకులకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధనలు అనుసరించి గోదాము నిర్వహణ చేయాలని నిర్వాహకులకు సూచించారు. భద్రతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు.

14న మండల పరిషత్తు సమావేశం

పెనుమంట్ర, న్యూస్‌టుడే: ఈ నెల 14న మండల పరిషత్తు సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో శర్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు అంతా హాజరు కావాలని కోరారు.

పెనుగొండలో వాయిదా

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకానందున ఈ సమావేశాన్ని వాయిదా వేశామని, త్వరలో ఏర్పాటు చేస్తామని చెప్పారు.

చెత్త తొలగించారు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు చెత్త వేస్తున్న తీరుపై 'కార్యాలయం ముందే చెత్త..!' శీర్షికతో ఈ నెల 3న 'ఈనాడు'లో ప్రచురితమైంది. దీనిపై పురపాలక పారిశుద్ధ్య అధికారి దావీద్‌రాజు స్పందించి సోమవారం కార్యాలయం ముందు ఉన్న చెత్తను సిబ్బందితో శుభ్రం చేయించారు. ఆ ప్రదేశంలో ఎవరూ చెత్త వేయకూడదని త్వరలోనే సూచిక బోర్డును ఏర్పాటు చేస్తామని చెప్పారు.

మురుగు శుభ్రం చేశారు

ఈనాడు కథనాలకు స్పందన

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం భగ్గేశ్వరంలో పెచ్చెట్టి వారి వీధిలో రహదారిపై మురుగు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిపై 'మురుగు పారదు.. సమస్య తీరదు' శీర్షికతో ఈ నెల 7న 'ఈనాడు'లో ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి రవిశంకర్ సోమవారం స్పందించి సిబ్బందితో మురుగు దారిని శుభ్రం చేయించారు.

పంట నష్టపరిహారం తక్షణం చెల్లించాలి


రైతు సేవా కేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఆచంట (మార్టేరు), న్యూస్‌టుడే: వల్లూరు గ్రామంలో వర్షాలకు గత ఏడాది పంట దెబ్బతిని నష్టపోయిన రైతులకు ఇంత వరకు నష్టపరిహారం చెల్లించలేదని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సార్వాలో స్థానికంగా 250 ఎకరాలు పాడవగా 120 మంది రైతులు నష్టపోయారని చెప్పారు. వీరిలో కేవలం 30 మందికే నష్టపరిహారం అందిందన్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే స్థానిక బ్యాంకు ఐఎఫ్‌సీ కోడ్ మారడంతో చెల్లింపులు జరగలేదని చెబుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణరాజు గోపాలన్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా భాజపా సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేస్తున్న తాతాజీ

నరసాపురం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో భాజపా సభ్యత్వ నమోదు చురుగ్గా సభ్యత్వ నమోదు చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నారిన తాతాజీ అన్నారు. మండలంలోని భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకల సతీష్ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు చేశారు. దీనికి హాజరైన ఆయన మాట్లాడారు.

రాజకీయాలకు అతీతంగా సాగుదాం.. ఎమ్మెల్యే

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ మైలాబత్తుల సోని అధ్యక్షతన జరిగిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఏ పార్టీ వారైనప్పటికీ నిధుల కేటాయింపులో వివక్షత ఉండదన్నారు. గత ఐదేళ్ల కాలంలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని, అందుకు భిన్నంగా ఎన్డీయే పాలన సాగిస్తుందని వివరించారు. సీతారాంపురం సౌత్ సర్పంచి దొండపాటి వెంకట్, సీతారాంపురం నార్త్ సర్పంచి పులపర్తి భ్రమరాంబ, చిట్టవరం సర్పంచి తాడి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యులు శీలం హరికృష్ణ, కొలపర్తి రామకృష్ణ తదితరులు తాగునీటి సమస్యలతోపాటు విద్యుత్తు సమస్యలపై సమావేశంలో ప్రస్తావించారు.



మాట్లాడుతున్న నాయకర్

నిబంధనలకు తిలోదకాలు

మండల పరిషత్ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని నిబంధనలు ఉన్నా వాటిని బేఖాతారు చేస్తూ సభ్యులు కాని వారు హాజరయ్యారు. ఎంపీపీ మైలాబత్తుల సోని తండ్రి శ్రీను, పట్టణ జనసేన అధ్యక్షుడు కోటిపల్లి వెంకటేశ్వరరావు, మండల జనసేన అధ్యక్షుడు ఆకన చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ దొండపాటి స్వాములు తదితరులు సమావేశానికి హాజరై సభ్యుల కుర్చీలో కూర్చున్నారు. ఈ దశలో మండల పరిషత్ సిబ్బంది కుర్చీలు తీసుకొచ్చి వేయడంతో అప్పటి వరకు నిలుచుని ఉన్న పసలదీవి సర్పంచి కొట్టు రామాంజనేయులు కుర్చీలో కూర్చున్నారు. కె.బేతపూడికి చెందిన ఎలుబండి సాయిబాబా అనే వ్యక్తి సమావేశంలోకి వచ్చి పంచాయతీ రాజ్ శాఖ ఏఈ వైవీఆర్ నాగేశ్వరరావును కె.బేతపూడిలోని సమస్య గురించి ప్రశ్నించగా అతని ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీవో రామకృష్ణంరాజు, ఎంఈవో పుష్పరాజ్యం, విద్యుత్తు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏఈఈలు కె.సుధాకర్, టి.లోకేశ్‌తోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెళ్లిన కొంత సేపటికే..

మండల పరిషత్ సమావేశం ప్రారంభమైన కొద్ది సేపటికి వచ్చిన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సమావేశంలో కొంత సేపు ఉండి, మాట్లాడి వెళ్లారు. ఆయన వెళ్లిన తర్వాత కొద్దిసేపు మాత్రమే సమావేశం నిర్వహించి పూర్తిస్థాయిలో సమీక్ష జరపకుండానే తూతూ మంత్రంగా ముగించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మొగల్తూరు, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. కాళీపట్నం పడమరలో పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన పశుగర్భకోశవ్యాధి చికిత్సా శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పశువులకు చికిత్సకు అవసరమైన ఔషధాలను నాయకర్ రైతులకు అందించారు. పశుగణాభివృద్ధి సంస్థ ఈవో జి.జేసురత్నం, ఏడీ వై.సుధాకర్, పశువైద్యులు తదితరులు పాల్గొన్నారు. ★ మల్లవరంలో గ్రామ సర్పంచి సంది సుజాత అధ్యక్షతన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌ను గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్థులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గత కొన్నేళ్లుగా మూతపడిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే గ్రామ సర్పంచి, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.

అక్రమ ఇసుక తవ్వకాలపై నిఘా

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఎవరైన అక్రమ ఇసుక, మట్టి తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పెనుగొండ తహసీల్దారు అనిత కుమారి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పెనుగొండ మండలంలోని సిద్ధాంతం, నడిపూడి ఇసుక ర్యాంపుల వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమ తవ్వకాలు జరిపితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా సోమేశ్వరరావు

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: సీపీఎం పట్టణ శాఖ కార్యదర్శిగా చల్లా సోమేశ్వరరావు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్యవర్గ ఎన్నిక సోమవారం నిర్వహించారు. ముందుగా అమరవీరులకు సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, వై.రాము, పి.సాంబశివరావు, పురుషోత్తం, యర్రా కృష్ణారావు, పాల్గొన్నారు.

పాలకవర్గ సభ్యులకు శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీడీవో

యలమంచిలి, న్యూస్‌టుడే: మండలంలోని 30 పంచాయతీలకు సంబంధించిన ఉప సర్పంచులు, పాలకవర్గ సభ్యులకు స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామాల నిర్వహణ, స్వచ్ఛతపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ప్రేమాన్విత మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించుకోవడం నేర్చుకోవాలని పలు సూచనలు చేశారు. ఈవోపీఆర్డీ జేడీవీ ప్రసాద్ మాట్లాడుతూ వీధి దీపాల నిర్వహణలో మెళకువలను తెలియజేశారు. సరైన నిర్వహణ ఉంటే విద్యుత్తు బిల్లులు కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు.

ఇళ్ల పట్టాలపై పూర్తిస్థాయిలో విచారణ

ఆచంట (మార్టేరు), న్యూస్‌టుడే: ఆచంట మండలం కొడమంచిలిలో గతంలో జారీ చేసిన ఇళ్లపట్టాల విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు తహసీల్దార్ ఎం.సోమేశ్వరరావు తెలిపారు. ఈ విషయమై సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక గ్రామం నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో పలు బృందాలు ఏర్పాటు చేసి లేఅవుట్ల వారీగా వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈ విచారణలో వచ్చిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

సీపీఎం సీనియర్ నాయకుడు ప్రసాద్ మృతి

ఆచంట (మార్టేరు), న్యూస్‌టుడే: ఆచంట వేమవరానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు వెన్నపు ప్రసాద్(73) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈయన ఆచంట సొసైటీ డైరెక్టర్‌గా, పంచాయతీ బోర్డు సభ్యుడిగా, పార్టీ మండల కమిటీ సభ్యుడిగా, గ్రామశాఖ కార్యదర్శిగా సేవలందించారు. ఈయన మృతికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, పార్టీ శాఖ కార్యదర్శి గుత్తుల రంగరావు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మొక్కలతోనే మంచి వాతావరణం

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాలకొల్లు లయన్స్ నగర్‌లో ప్రకృతి నేస్తం బృందం ఆధ్వర్యంలో మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కంభంపాటి ఉమా మహేశ్వరి, జ్యోతి, సరళ, పెండ్యాల భవాని, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

నెలల తరబడి తిరుగుతున్నాం..

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బాధితులు

నరసాపురం, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా క్షేత్రస్థాయి అధికారులు నిరాసక్తత చూపుతున్నారు. దీంతో డివిజన్, జిల్లాస్థాయి కార్యాలయాల మెట్లెక్కవలసి వస్తుందని ప్రజలు 'న్యూస్‌టుడే' వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

పంచాయతీకి స్వాధీనం చేయాలి



నీరు, చెట్టు పథకంలో గ్రామంలోని ప్రభుత్వ భూమిలో సుమారు 400 వరకూ ఫలసాయాన్ని ఇచ్చే మొక్కలు నాటారు. వాటిని ఇప్పటి వరకూ పంచాయతీకి స్వాధీనం చేయలేదు. ప్రైవేటు వ్యక్తి స్వాధీనంలోనే ఉన్నాయి. దీనిపై మా గ్రామస్థులు పలు పర్యాయాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా పరిష్కరించలేదు. **- జల్లి ఆశిష్‌కుమార్, ఎల్‌బీచర్ల**

స్థలం ఆక్రమణ



మాకు గ్రామంలో ఉన్న స్థలాన్ని సమీపంలోని వ్యక్తులు ఆక్రమించారు. దీనిపై సర్వే, ఆక్రమణలు తొలగించాలని కోరుతూ పలు పర్యాయాలు అధికారులకు ఫిర్యాదు చేశాం. ప్రయోజనం లేదు. **- ఇంజేటి ప్రవల్లిక, చిట్టవరం**

అధికారులకు ఫిర్యాదు చేసినా..



మా స్థలం ఆక్రమణకు గురైంది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశా. పలు పర్యాయాలు మండల రెవెన్యూ కార్యాలయం వద్దకు తిరిగా. సమస్య పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టలేదు. **- కొప్పాడ ప్రసాద్, కనకాయలంక**

భూమి వివరాలే లేవు



మాకు పూర్వార్జితం ద్వారా 1.34 ఎకరాలు వచ్చింది. ఆ భూమికి సమీపంలో భూమి సేకరించి అప్పటి ప్రభుత్వం కాలనీ ఏర్పాటు చేసింది. మా భూమి నుంచి కూడా 17 సెంట్లు తీసుకున్నారు. మా భూమి మొత్తం 22 ఏ జాబితాలో చేర్చారు. ఈ సమస్య పరిష్కరించాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. కాలనీకి సేకరించిన భూములకు సంబంధించి దస్త్రాలు లేవని మండల రెవెన్యూ కార్యాలయంలో అధికారులు చెబుతున్నారు. **- ఆదూరి గణిపోతు రాజు, శేరేపాలెం**

వినతులన్నింటినీ పరిష్కరిస్తాం : ఆర్డీవో

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చిన వినతులన్నింటినీ పరిష్కరిస్తామని ఆర్డీవో దాసి రాజు తెలిపారు. నరసాపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా వినతుల పరిష్కార వేదిక'లో ఆయన ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా పరిష్కారానికి హామీ ఇచ్చారు. మొత్తం 40 మంది వినతులు అందించారని కార్యాలయ జూనియర్ అసిస్టెంటు బి.సురేఖ తెలిపారు. పోడూరు మండలం గుమ్ములూరుకు చెందిన అడ్డాల మంగమ్మ ఇంట్లో చోరీ జరిగిందని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. నరసాపురం పట్టణం టైలరుపేటకు చెందిన గుగ్గిలపు కనకరత్నం గృహనిర్మాణసంస్థ నుంచి దస్తావేజులు ఇప్పించాలని, బియ్యపుతిప్పలో స్లూయిజ్ తలుపులు అమర్చాలని వాతాడి ఉమా మహేశ్వరరావు, ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయించాలని రుస్తుంబాదకు చెందిన జాగరపు సీత, తన భార్యను గల్ఫ్ పంపించిన ఏజెంటు మోసం చేశాడని అతనిపై చర్యలు తీసుకోవాలని మొగల్తూరుకు చెందిన కడలి శ్రీనివాస్ ఫిర్యాదులు అందించారు. ఆయా వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆర్డీవో హామీ ఇచ్చారు.


వినతులు స్వీకరిస్తున్న దాసిరాజు

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

పెనుగొండ, న్యూస్‌టుడే: తన భర్త వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని తనను వేధిస్తున్నాడని పెనుగొండ దక్షిణపేటకు చెందిన జుత్తిగ లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పెనుగొండ పోలీసు స్టేషన్ రైటర్ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. లత భర్త సత్యనారాయణ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం లత చర్చిలో ఉన్న సమయంలో భర్త సత్యనారాయణ లత కుడి జబ్బ మీద చాకుతో గాయపర్చడంతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరానని ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

వాహనం ఢీకొని మహిళకు గాయాలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: మార్టేరు-అత్తిలి రాష్ట్ర రహదారిపై నడిచి వెళ్తున్న సందర్భంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మహిళ గాయపడింది. పోలీసుల కథనం మేరకు.. పెనుమంట్రకు చెందిన టి.మరియమ్మ స్థానిక దుకాణం నుంచి ఆదివారం రాత్రి పెరుగు కొనుగోలు చేసి ఇంటికి వెళ్తుండగా స్థానిక కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో వెనుక నుంచి వాహనం ఢీకొంది. దీంతో ఆమె చికిత్స నిమిత్తం తణుకులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు

అన్నదమ్ములపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: వాగ్వాదం శృతిమించి కొట్టుకున్న అన్నదమ్ములపై సోమవారం వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. అరుంధతిపేటకు చెందిన తానేటి శ్రీను, నాగరాజులు అన్నదమ్ములు. వీరి మధ్య వివాదం నెలకొని రెండు వర్గాలుగా విడిపోయి కొట్టుకున్నారు. తన భర్త సోదరుడు శ్రీను తమను కొట్టి గాయపరిచాడని తానేటి మణి, తన సోదరుడు, అతని బావమరుదులు జువ్వల ప్రేమకుమార్, రాజు కొట్టి గాయపరిచారని శ్రీను ఇచ్చిన ఫిర్యాదుల మేరకు వేర్వేరుగా కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

లోకమాతా.. దీవించమ్మా

పాలకొల్లు, ఆధ్యాత్మికం, యలమంచిలి, పెనుగొండ, నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ఆచంట, పాలకల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అయిదో రోజు సోమవారం జగన్మాత వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చింది. క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవిని మహా చండీ దేవిగా అలంకరించారు. స్థానిక వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో రంగురంగుల గాలి పటాల అలంకరణలో గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. యడ్లబజారు కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. యలమంచిలి మండల కేంద్రంలోని ప్రధాన కూడలి, పెదపాలెం, పుంతల ముసలమ్మ ఆలయం దగ్గర నిత్యం కోలాటం నిర్వహిస్తున్నారు. పెనుగొండ క్షేత్రంలో మహిషాసురమర్దని, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవార్లు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ఈవో గుబ్బల రామపెద్దింట్లరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక వాసవీశాంతిధాంలో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో ఉత్సవాలు కనులపండువగా చేస్తున్నారు.


పెనుగొండ: గాయత్రీదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి


మొగల్తూరు: కూరగాయాల మార్కెటో...


పాలకొల్లు: వాసవీ కల్యాణ మండపంలో గాయత్రీ దేవిగా..

సంపదకు సెగ.. పర్యావరణానికి పొగ

నరసాపురం, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా పక్షం రోజులు పంచాయతీలు, పురపాలక సంఘాల్లో 'స్వచ్ఛతా హీ సేవ' అంటూ ఊదరగొట్టారు. ఇంకా వారమైన గడవకముందే ప్రజల ఇళ్ల వద్ద నుంచి సేకరించిన చెత్తకు నిప్పుపెడుతున్నారు. దీంతో స్థానిక సంస్థలకు సంపద చేకూర్చాల్సిన చెత్త తగలబడుతుంది. సీతారామపురంలో 216 జాతీయ రహదారి పక్కన వేసిన చెత్తకు రెండు రోజుల కిందట నిప్పుపెట్టారు. వాటిల్లోని ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి ఘాటైన వాసనతో వెలువడుతున్న పొగతో ఊపిరాడక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇలా పలుచోట్ల చెత్తకు నిప్పుపెడుతున్నారు. అధికారులు స్పందించి పర్యావరణానికి హాని చేసే ఇటువంటి పనులకు పాల్పడకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


సీతారామపురం: చెత్తకు నిప్పుపెట్టడంతో వెలువడుతున్న పొగ

వెండి వస్తువుల బహూకరణ

యలమంచిలి, న్యూస్‌టుడే: అడవిపాలెంలోని పుంతల ముసలమ్మ ఆలయంలోని విగ్రహానికి వెండి ముఖ అలంకరణ వస్తువులను గ్రామానికి చెందిన బొలిశెట్టి త్రిమూర్తులు దంపతులు బహూకరించారు. కోనసీమ జిల్లా శివకోడుకు చెందిన మాలే దుర్గేశ్ ఇత్తడి మకర తోరణం, పోతురాజు సత్యనారాయణమూర్తి ఇత్తడి కిరీటం, అడవిపాలేనికి చెందిన ఈమన రమేశ్ ఇత్తడి గంట సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అయిదు అర్జీలు అందాయి

పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో అయిదు వినతులు అందాయని తహసీల్దార్ జి.అనితకుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీరాజ్-మూడు, రెవెన్యూ శాఖకు రెండు వినతులు అందించారన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖాధికారులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయంలో వినతి తీసుకుంటున్న అనితకుమారి

క్షీరారామలింగేశ్వరస్వామి సేవలో కళాకారులు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణం క్షీరారామలింగేశ్వరస్వామిని ఆధ్యాత్మిక గురువు కళాకారుడు ఈరంకి కాశీ విశ్వనాథం సోమవారం దర్శించుకున్నారు. ఆయనతోపాటు హైదరాబాదుకు చెందిన శ్రీధర రాధ కల్చరల్ అసోసియేషన్ కళాకారులు కృష్ణమోహన్, జి.మనుప్రియలను ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు సత్కరించారు.


స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో శ్రీనివాస్

ముఖదారమ్మను దర్శించిన మండెల

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అయోధ్య రామ మందిరం నిర్మాణానికి పునాది డిజైన్ చేసిన నిపుణుడు మండెల పాండురంగారావు పాలకొల్లు పట్టణం అచ్చుగట్లపాలెం చిత్తర్వు చెరువుగట్టున ఉన్న ముఖదారమ్మను సోమవారం దర్శించుకున్నారు. అనంతరం కుంకుమ పూజలు చేయించుకున్నారు. కమిటీ సభ్యులు, పెద్దలు ఆయనకు అమ్మవారి చిత్ర పటాన్ని అందించి శాలువాతో సత్కరించారు. పాలకొల్లు మండలం గోరింటాడలోనూ మండెల కుటుంబ సభ్యులు పాండురంగారావును ఘనంగా సత్కరించారు.


పాండురంగారావు దంపతులను సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

వేధింపుల నిరోధక చట్టాన్ని పరిరక్షించాలి



తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టాన్ని పరిరక్షించాలని దళిత సేన నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బీవీఆర్ కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై ఇప్పటి వరకు నమోదైన కేసులపై విచారణ వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి ప్రకాష్, కిలాడి రవి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల ఆందోళన

పెదతాడేపల్లి (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలంలో వరికోత మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం కోసి ఒబ్బిడి చేస్తుండగా వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. దీంతో ధాన్యం తడవకుండా బరకాలతో కప్పి లారీల్లోకి లోడు చేస్తున్నారు. ఇబ్బందిలేకుండా రైస్ మిల్లులకు చేరవేస్తున్నారు.



ధాన్యం బస్తాలు లోడు చేస్తున్న కూలీలు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	:79950 67078
పెంటపాడు	:79939 36123
తణుకు గ్రామీణ	:85558 50851
అత్తిలి	:91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం సవిత్రపేట సాయిబాబా ఆలయం రోడ్డులో కల్వర్టు వద్ద చెత్త పేరుకుని నీరు నిల్వ ఉంటోంది. దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి **- కృష్ణ, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి కల్వర్టు వద్ద వ్యర్థాలు తొలగించి నీరు సాఫీగా సాగేలా చర్యలు చేపడతాం. **- సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం మహాలక్ష్మీనగర్ నాలుగో రోడ్డు శివారులో చెత్త పేరుకుని రహదారి పైకి వస్తోంది **- నారాయణ, స్థానికుడు**

సమాధానం: చెత్త తొలగించేలా చర్యలు చేపడతాం. **- శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే

సమస్య: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో కుళాయిల నుంచి మురుగు నీరు సరఫరా అవుతోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. **- సత్యనారాయణ, స్థానికుడు**

సమాధానం: సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. **- ఏసుబాబు, కమిషనర్**

సమస్య: స్థానిక కడకట్లలోని ప్రధాన మురుగు బోదె వ్యర్థాలతో పూడుకుపోయింది. **- దీపక్, స్థానికుడు**

సమాధానం: బోదెలను శుభ్రం చేసి సమస్య పరిష్కరిస్తాం. **- ఏసుబాబు, కమిషనర్**

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు మొలిచి విష పురుగులకు నిలయంగా మారాయి. **- రమేష్, స్థానికుడు**

సమాధానం: ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు చేపడతాం **- ఏసుబాబు, పురపాలక కమిషనర్**

పెంటపాడు, న్యూస్‌టుడే

సమస్య: పెంటపాడు మండలం దర్శిపర్రు శివారు గ్రామం బిళ్లగుంటలో డ్రెయిన్ల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగంతా రోడ్లపైకి చేరుతోంది. **- నారాయణ, స్థానికుడు**

సమాధానం: డ్రెయిన్లలో పూడిక తొలగిస్తాం. **- కోలా శేషవేణి, సర్పంచి**

సమస్య: పెంటపాడు సంతబజారుకు వెళ్లే మార్గంలో పాత జెబీవ కళాశాల వద్ద రహదారిపై కొందరు చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. **- రాము, స్థానికుడు**

సమాధానం: చెత్త తొలగించి శుభ్రం చేయిస్తాం. చెత్త వేసే వారిపై చర్యలు తీసుకుంటాం. **- సూర్యకళ, సర్పంచి**

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:

సమస్య: రేలంగి ఇందిరానగర్‌లో మురుగు పారక నిలిచి దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. **- కుమార్, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి చర్యలు చేపడతాం. **-లక్ష్మీనారాయణ, రేలంగి పంచాయతీ కార్యదర్శి**

అధ్వానంగా కాలువలు..!



పెంటపాడులో మిడ్‌లెవల్ కాలువ

పెంటపాడు, తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే

తాడేపల్లిగూడెం పట్టణం, పెంటపాడు మండలంలోని కాలువలు అధ్వానంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎక్కడకక్కడే మురుగు నీరు కాలువలోకి చేరుతోంది. నందమూరు నుంచి తాడేపల్లిగూడెం పట్టణం మీదుగా పడాల వరకు ఏలూరు కాలువ ఉంది. ప్రత్తిపాడు, జువ్వలపాలెం, పోలీస్‌ఐలాండ్, చినవంతెన, యాగర్లపల్లి, కడకట్ల, పడాల ప్రజలు చెత్త, వ్యర్థాలు కాలువలో పడేస్తున్నారు. కొందరు వ్యాపారులు కుళ్లిన ఉల్లిపాయలను నేరుగా కాలువలో పడేస్తున్నారు. ఒకటో పట్టణానికి చెందిన మురుగంతా పెద్ద శివాలయం, కడకట్ల వద్ద ఏలూరు కాలువలోకే చేరుతుంది. దీంతో తాగునీరు కలుషితమవుతోంది.



తణుకు బస్టాండ్ సమీపంలోని ఏలూరు కాలువ

పొంచి ఉన్న వ్యాధుల భయం

తాడేపల్లిగూడెం పట్టణంలో 35 వార్డులు ఉన్నాయి. పెంటపాడు మండలంలో 22 గ్రామాలుండగా సుమారు 61 వేల మంది నివసిస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలం పడాల, ముత్యాలంబపురం గ్రామాల్లో సుమారు 10 వేల మంది ఉన్నారు. ఆయా పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఏలూరు కాలువ, లోలెవల్, మిడ్‌లెవల్ కాలువలు ప్రధాన తాగు, సాగునీటి వనరులు. ఈ కాలువ నీటినే అర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసి ప్రజలకు అందిస్తున్నారు. పురపాలక పరిధిలో సేకరించిన చెత్తలో అనేక రకాల వ్యర్థాలు ఉంటున్నాయి. ఇవన్నీ నీటిలో కలుస్తుండటంతో ఈ-కొలై బ్యాక్టీరియా వృద్ధి చెందే ప్రమాదం ఉంది. దీని కారణంగా అతిసారం వచ్చే లక్షణాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారుల స్పందించి కాలువల కలుషితాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

"తాడేపల్లిగూడెం పట్టణ పరిధిలోని ఏలూరు కాలువలో చెత్త, వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకుంటాం. మురుగునీరు కలవకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం. మిడ్‌లెవల్, లోలెవల్ కాలువలు కలుషితం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటాం." అని కమిషనర్ ఏసుబాబు, ఏఈ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

● పెంటపాడు మండలంలోని మిడ్ లెవల్ కాలువలో అలంపురం, పెంటపాడు గ్రామాల్లో చెత్తను నేరుగా కాలువలోనే పడేస్తున్నారు.

● దర్శిపర్రులో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నేరుగా కాలువల్లో గొట్టాల ద్వారా వదిలేస్తున్నారు. తాగునీటి కాలుష్యం నివారించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. లో లెవల్ కాలువలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

ఉచిత ఇసుక విధానం అమలుకు వినతి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని సీపీఎం ఇరగవరం మండల కార్యదర్శి కామన మునిస్వామి డిమాండ్ చేశారు. ఇరగవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం పార్టీ నాయకులతో కలిసి నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం తహసీల్దార్ ఎం.సుందరరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, అప్పారావు, ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో శిక్షణ తరగతులు



సూచనలు చేస్తున్న ఎంపీడీవో శామ్యూల్

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, గృహనిర్మాణం, విజన్ స్వర్ణాంధ్ర 2047, వాటర్ షెడ్లు తదితర కార్యక్రమాల అమలుపై ఎంపీడీవో శామ్యూల్ సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 9, 10 తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులకు, ఉపసర్పంచులకు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసు పాల్గొన్నారు.

తణుకు ఎంపీడీవోగా జయసాగర్

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు ఎంపీడీవోగా ఆర్ లోహిత జయసాగర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా జి మాడుగుల మండలం ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన కిరణ్‌కుమార్ కొయ్యలగూడెం ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జయసాగర్‌కు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏవో కృష్ణచంద్, ఈవోపీఆర్డీ రామ్‌ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.





ర్యాలీ చేస్తున్న న్యాయమూర్తి సత్యవతి తదితరులు

18 ఏళ్ల లోపు వారిని పనిలో పెట్టుకోవద్దు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: 18 ఏళ్ల లోపు పిల్లలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే యజమానికి శిక్షతోపాటు జరిమానా విధిస్తారని తణుకు 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.సత్యవతి హెచ్చరించారు. ఆపరేషన్ స్వేచ్ఛా 2024 కార్యక్రమంలో భాగంగా సోమవారం న్యాయ, కార్మిక, పోలీస్, శిశుసంక్షేమ శాఖలు సంయుక్తంగా బాల కార్మిక, నిర్బంధ బాలల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలు సందర్శించి యజమానులకు అవగాహన కల్పించారు. అనంతరం బాల కార్మికులు ఉన్నారో లేదో తనిఖీ చేసి 'ఇచ్చట బాల కార్మికులు లేరు' అని స్టిక్కర్ అతికించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, మొదటి జూనియర్ సివిల్ న్యాయమూర్తి పీఎన్‌వీ రంజిత్ కుమార్, స్పెషల్ కోర్టు మెజిస్ట్రేట్ చిరంజీవిరావు, సహాయ కార్మిక అధికారి ఎం కిరణ్‌కుమార్, బార్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తాం



మాట్లాడుతున్న బొలిశెట్టి శ్రీనివాస్

పెంటపాడు, న్యూస్‌టుడే: పేదలకు నాణ్యమైన వైద్య సదుపాయాలను పీహెచ్‌సీల ద్వారా అందించేందుకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీల సలహా సంఘాలతో సోమవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు అన్నిరకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యాన్ని అందించాలని వైద్యాధికారులకు సూచించారు. పెంటపాడు పీహెచ్‌సీకి ఎమ్మెల్యే సొంత నిధులతో ఇన్వర్టర్, బ్యాటరీలను సమకూర్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, ఎన్డీయే నాయకులు కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, నల్లిమిల్లి చినగోపిరెడ్డి, కొవ్వూరి భాస్కర రెడ్డి, కసిరెడ్డి మధులత, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాధవరం(తాడేపల్లిగూడెం వన్ టౌన్), న్యూస్‌టుడే: ఎర్రకాలువ వరదలతో తీవ్రంగా నష్టపోయిన తమకు పెట్టుబడి రాయితీ ఇప్పించాలని సోమవారం జగన్నాథపురం రైతులు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను కోరారు. ఎమ్మెల్యే స్పందించి వ్యవసాయ అధికారులతో మాట్లాడారు. త్వరలో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

కార్మికుల హక్కుల కోసం ఏచూరి కృషి



మాట్లాడుతున్న సీతారాం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: కార్మిక హక్కుల కోసం సీతారాం ఏచూరి విశేష కృషి చేశారని, 22 ఏళ్ల వయస్సులోనే ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించారని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. స్థానిక మెడికల్ అసోసియేషన్ భవనంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పీవీ ప్రతాప్ అధ్యక్షతన సోమవారం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏచూరి బాల్యం నుంచి ఒక విజ్ఞాన శిఖరమని, తుదిశ్వాస వరకు ఆయన ఆలోచనలు, అధ్యయనం పేదల కోసమేనని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, తెదేపా, జనసేన, వైకాపా నాయకులు పాల్గొన్నారు.


క్రీడా కెరటాలు



పెదతాడేపల్లి పాఠశాల విద్యార్థులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం, దండగర్ర, కొమ్ముగూడెం, పెదతాడేపల్లి పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) మండల, నియోజకవర్గ పోటీల్లో ప్రతిభ చూపారు. జిల్లా స్థాయి జట్టుకు అర్హత సాధించారు. కబడ్డీ, ఖోఖో, చదరంగం, యోగా పోటీల్లో మెరుస్తున్నారు. తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

పతకాలు సాధిస్తా



క్రీడల్లో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నా. జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగే విధంగా సాధన చేస్తున్నా. వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తా. **- దుర్గలలిత, జగన్నాథపురం**

యోగాతో ఆరోగ్యం



యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చు. వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఆసనాలపై పట్టు సాధించా. వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పోటీల్లో పతకాలు సాధిస్తున్నా **- సందీప్**

ఖోఖోపై ఆసక్తి



ఖోఖో ఆట అంటే ఆసక్తి. దీనిపై వ్యాయామ ఉపాధ్యాయులు అందిస్తున్న సూచనలు పాటిస్తున్నా. క్రీడా కోటాలో కొలువు సాధించడమే లక్ష్యం. **- సత్యనారాయణమూర్తి**



"గత ప్రభుత్వం పన్నులు వసూళ్లు చేయడంపై ఉన్న శ్రద్ధ మౌలిక వసతులు కల్పించడంలో చూపలేదు. కూటమి ఇచ్చిన మాట మేరకు చంద్రబాబు గాంధీ జయంతి సందర్భంగా చెత్త పన్ను రద్దు చేయడం అభినందనీయం. ఇంటి పన్ను చెల్లిస్తున్న ప్రజలకు మళ్లీ చెత్త పై ప్రత్యేక పన్ను విధించారు. అప్పటి వైకాపా ప్రభుత్వం ప్రజలపై భారం మోపింది." అని పట్టణానికి చెందిన మారుతీరావు పేర్కొన్నారు.



"గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేయడం ద్వారా ప్రజల నుంచి చాలా వ్యతిరేకత వచ్చింది. అయినా పాలకులు లెక్కచేయలేదు. సామాన్యులకు మరింత భారంగా మారిన చెత్త పన్ను రద్దు చేస్తూ చంద్రబాబు తీసుకున్న నిర్ణయం అన్ని వర్గాలకు మేలు చేస్తుంది." అని తణుకు పట్టణానికి చెందినరాంబాబు అన్నారు.

తప్పిన భారం రూ.1.80 కోట్లు

చెత్త పన్ను రద్దు ప్రకటనపై హర్షం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో ఇబ్బందులకు గురి చేసిన చెత్త పన్ను నుంచి పట్టణ ప్రజలకు ఉపశమనం కలిగింది. దీనిని రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తణుకు పట్టణంలో ప్రజలపై ఏటా రూ.1.80కోట్ల వరకు భారం తప్పనుంది. గత ప్రభుత్వంలో పన్నును ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేశారు. తీవ్ర వ్యతిరేకత వచ్చినా వైకాపా పాలకులు లెక్క చేయలేదు.

తణుకు పట్టణంలో వివరాలు

వార్డులు	నివాసాలు
34	30 వేలు
క్లాప్ ఆటోలు	20
చెత్తపన్ను (నెలకు)	
రూ.15 లక్షలు	

పింఛన్ నగదులోనూ కోత వేసి...

గత వైకాపా ప్రభుత్వం 2022 ఫిబ్రవరి నుంచి ఇంటింటి చెత్త సేకరణ విధానాన్ని తెరపైకి తెచ్చింది. ప్రతి రోజు 20 క్లాప్ ఆటోలు, ట్రాక్టర్లు తదితర వాహనాలపై 40 టన్నుల వరకు వ్యర్థాలు సేకరిస్తారు. వార్డుల వారీగా పురపాలక, సచివాలయ సిబ్బంది పన్ను వసూళ్లు చేసేవారు. సామాజిక పింఛన్‌లో కోత వేసి మరి చెత్త పన్ను కట్టించుకునేవారు. డ్వాక్రా మహిళల నుంచి పొదుపు మొత్తాలను మళ్లించడం కూడా చేశారు. ఇలా ఇప్పటి వరకు సుమారు రూ.3.5 కోట్ల వరకు వసూళ్లు చేసినట్లు సమాచారం. అయితే జూన్ నెల వరకు రూ.77 లక్షలు చెత్త పన్ను బకాయి చెల్లించాల్సి ఉంది.



మూలకు చేరిన వాహనాలు

యుద్ధాన్ని నిలుపుదల చేయాలంటూ డిమాండ్

పెదతాడేపల్లి (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: గాజాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని నిలుపుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం పెదతాడేపల్లిలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సంవత్సర కాలంగా చేస్తున్న దాడులకు సుమారు యాభై వేల మంది ప్రాణాలు కోల్పోయారని, గాజాలో తొంభై శాతం ప్రజలు నిరాశ్రయులుగా మారారని వాపోయారు. భారత ప్రభుత్వం ఐక్యరాజ్య సమితిపై ఒత్తిడి తీసుకొచ్చి యుద్ధ నివారణ చర్యలు చేపట్టాలని ఐఎఫ్‌టీయూ విజ్ఞప్తి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.నాగరాజు, సీహెచ్ వెంకటేశులు, ముసలయ్య, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

జూద స్థావరంపై దాడి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకులోని ఒక హోటల్‌లో నిర్వహిస్తున్న జూద స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. వారి కథనం మేరకు.. హోటల్‌లో కోతాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో పట్టణ, రూరల్ సీఐలు, కె.కొండయ్య, బి.కృష్ణకుమార్, ఎస్సైలు కె.శ్రీనివాస్, జీఎస్‌వీ మూర్తి ఆధ్వర్యంలో దాడి చేసి 41 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,17,020, 41 చరవాణులు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై మూర్తి తెలిపారు.

వసతులు కల్పించండి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: వేల్పూరు లాకుల వద్ద శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. శ్మశాన వాటికలో రహదారులు, నీరు, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్టీలకు శ్మశాన వాటిక అప్పగించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: మాధవరంలో ఎస్టీల శ్మశాన వాటికను వారికే అప్పగించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆర్డీవో బీవీఎస్ నారాయణ రెడ్డికి, తహసీల్దార్ ఎమ్.సునీల్ కుమార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. శ్మశాన వాటిక సర్వే చేసి ఎరుకుల చెందిన భూమిని వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఏపీ ఎస్టీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమరాజు, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన్న నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పెదతాడేపల్లిలోని ఓ గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్సు సీఐ శివరామకృష్ణ సోమవారం రాత్రి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గోదాముల్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచుతున్నారనే సమాచారం మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. రూ.5.8 లక్షల విలువైన 145 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. బాధ్యులైన కౌశిక్ మణికంఠ, రామకృష్ణ, ఆంజనేయులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. విజిలెన్సు ఎస్సై రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

బెదిరించిన ఘటనపై కేసు..

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: చంపుతానని బెదిరించిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబాయ్ పంపిస్తానని చెప్పి అత్తిలి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ నర్సమ్మ వద్ద నీతిపూడి వెంకట్రావు(ఉరదాళ్లపాలెం) డబ్బులు తీసుకున్నాడు. కానీ దుబాయ్‌కు పంపకపోవడంతో తన డబ్బులు ఇవ్వాలని బాధితురాలు కోరారు. ఈ నేపథ్యంలో వెంకట్రావు ఆదివారం రాత్రి బాధితురాలి ఇంటికెళ్లి బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

బాణసంచా అక్రమ నిల్వలపై..

అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా బాణసంచా కలిగి ఉన్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీ నిర్వహించి కేసు నమోదు చేసిన ఘటన సోమవారం అత్తిలి మండలం కంచుమర్రులో జరిగింది. గ్రామంలో సత్తుశెట్టి సత్యవతి(45) అనే మహిళ అక్రమంగా బాణసంచా తయారు చేసి అమ్మకాలు సాగిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఆమె నుంచి 65 తారాజువ్వలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

త్రినయనీ.. శక్తి స్వరూపిణీ



సర్వమంగళ అమ్మవారు



ఆరుగొలనులో విజయదుర్గ



నిట్ రోడ్డులోని కొండాలమ్మ



బాలా త్రిపుర సుందరి



అత్తిలిలో కనకదుర్గమ్మ



మండపాక యల్లారమ్మ



దువ్వలోని దానేశ్వరి

తాడేపల్లిగూడెం అర్బన్, తాడేపల్లిగూడెం వన్‌టౌన్, టూటౌన్, తణుకు గ్రామీణం, అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాజరాజేశ్వరి దేవి అలంకరణలో విశ్వదుర్గేశ్వరి, వాసవీ అమ్మవార్లను అలంకరించారు. శంకరమఠంలోని సర్వమంగళ అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. ఏపీ నిట్ సమీపంలో కొండాలమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. ఏలూరు రోడ్డులోని శ్రీదేవి మహంకాళమ్మవారు రజిత కవచాలంకృత దుర్గాదేవిగా, రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణయోగ ధ్యాన మందిరంలో చింతామణి అమ్మవారు శ్రీ గజలక్ష్మిగా దర్శనమిచ్చారు. ★ వీరంపాలెంలోని బాలాత్రిపుర సుందరీ దేవి పీఠంలో అమ్మవారు స్కందమాతగా భక్తులకు దర్శన మిచ్చారు. నిర్వాహకుడు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొంద్రప్రోలులో భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారిని విశేషంగా అలంకరించారు. ముత్యాలంబపురంలో ముత్యాలమ్మ దేవస్థానంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ కరెన్సీ నోట్లతో అలంకరించారు. దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాక యల్లారమ్మకు కుంకుమపూజలు చేసి గాజులతో అలంకరించారు. దువ్వ దానేశ్వరి అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేసి అలంకరించారు. ★ అత్తిలి తెనుకులవారి కల్లంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో దుర్గాభవానీ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.